ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

శనివారం 6 డిసెంబరు 2025



గిరిజన ప్రపంచం ఉద్భవం

- ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు చిన్నారుల ప్రదర్శనలతో ఆవిష్కృతం
- ముగిసిన ఉద్భవ్‌- 2025 వేడుకలు



6

అవినీతి చేస్తే చర్యలు తప్పవు

- మార్కెటింగ్ సిబ్బందికి డైరెక్టర్ విజయ సునీత వార్నింగ్
- కాన్ఫరెన్స్ లో 'ఆంధ్రజ్యోతి' కథనం పై చర్చ

6

నాటి నాసిరకం వైన్ం మారింది!

- ప్రస్తుతం క్వాలిటీ, బ్రాండ్ల విషయంలో మెరుగ్గా మద్యం దుకాణాలు
- ప్రైవేట్ దుకాణాల్లో పెరిగిన విక్రయాలు, అధునాతన సౌకర్యాలు
- వైసీపీ జమానాలో నాసిరకం మద్యం అమ్మకాలు
- క్యాష్ ఇస్తేనే మద్యం.. డిజిటల్ పేమెంట్లకు నో..
- కావాల్సిన బ్రాండ్లకు బార్లకు వెళ్లాల్సిందే..



6



శ్రీకాంత్‌రెడ్డి　యశ్వంత్ సాయి, వాసు　మహేష్

బీటెక్ విద్యార్థులకు కన్నీటి వీడ్కోలు

- రోడ్డు ప్రమాదంతో నాలుగు కుటుంబాల్లో విషాదం
- పోస్టుమార్టం అనంతరం స్వగ్రామాలకు మృతదేహాలు

వినుకొండ టౌన్, నూజెండ్ల, పిడుగురాళ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీటెక్ చదువుకుంటున్నారు.. కుటుంబానికి ప్రయోజనం చేకూరుస్తారని ఆశించిన తల్లిదండ్రులను విషాదానికి గురిచేస్తూ అశువులు బాశారు. శనివారం ఇరుముడితో శబరిమల యాత్రకు వెళ్లే క్రమంలో మిత్రులందరూ వినుకొండకు బయల్దేరగా ఊహించని రీతిలో వీరు ప్రయాణిస్తున్న కారు కంటైనర్‌ను ఢీకొట్టింది. చిలకలూరిపేట బైపాస్‌లో నాదెండ్ల మండలం గణపవరం వద్ద గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో విజ్ఞాన్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు మృతి చెందగా వారిలో నలుగురు పల్నాడు జిల్లాకు చెందిన వారున్నారు. అయ్యప్పమాల ధరించిన విద్యార్థులు గుంటూరు నుంచి వినుకొండలోని ఆలయానికి కారులో వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో వినుకొండ మండలం శివాపురానికి చెందిన మేరుగు శ్రీకాంత్‌రెడ్డి(21), నూజెండ్ల మండలం మూలకలూరు కు చెందిన యశ్వంత్ సాయి(19), వంగవల్లు వాసు(19), పిడుగురాళ్లకు చెందిన శివరాత్రి మహేష్‌బాబుతో పాటు ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం వితాలాపురానికి చెందిన మెడిగం రామిరెడ్డిలు మృతి చెందిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన వినుకొండ మండలం దొండపాడు గ్రామానికి చెందిన మద్దుకూరి కార్తీక్ గుంటూరులో చికిత్స పొందుతున్నాడు. కాగా పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను అప్పగించడంతో వారివారి గ్రామాల్లో విద్యార్థులకు కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. విద్యార్థులకు స్నేహితులు, బంధువులు, ఆయా గ్రామాలకు చెందిన వారు కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ ప్రమాదంలో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీకాంత్‌రెడ్డికి తండ్రి సుబ్బారెడ్డి, తల్లి కృష్ణకుమారి, నాయ నమ్మ వెంకా యమ్మ, సోదరుడు గౌతమ్‌రెడ్డి ఉన్నారు. వ్యవసాయంలో ఇంతకాలం తండ్రి పడిన కష్టం ఇక పడనివ్వనంటూ శ్రీకాంత్‌రెడ్డి చెప్పిన మాటలు తలుచుకుంటూ కుటుంబసభ్యులు కన్నీటి పర్యంత మయ్యారు. యశ్వంత్ సాయి తల్లి కుమారి ఏఎన్ఎంగా సేవలు అందిస్తున్నారు. వంగవల్లు వెంకటరావు,

(మిగతా 8వ పేజీలో)

విద్యార్థుల్లో శక్తిని గుర్తించాలి



- పిల్లల ఆలోచనలు, ప్రవర్తనలోనే భవిష్యత్
- అబ్దుల్‌కలాం స్ఫూర్తితో విద్యార్థులు ఎదగాలి
- మెగా పీటీఎంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్







పాఠశాలకు పవన్ వరాలు

శారదా పాఠశాలకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వరాలు ప్రకటించారు. తన సొంత నిధులతో గ్రంథాలయాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. పూర్తి స్థాయిలో పుస్తకాలు అందిస్తానని, బీరువాలు ఇస్తానన్నారు. పాఠశాలకు 25 కంప్యూటర్లను విరాళంగా అందజేస్తానని చెప్పారు. ఆట స్థలం కావాలని విద్యార్థిని జాస్మిన్ కోరగా స్పందించిన పవన్ ఆట స్థలం ఏర్పాటు చేయాలని అధికారులను వేదికపైనే ఆదేశించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చొరవ తీసుకోవాలని చెప్పారు. కూటమి, జనసేన నేతలు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మొబైల్ లైబ్రరీల ఏర్పాటుపై ఆలోచన చేయాలన్నారు.

చిలకలూరిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అద్భుతమైన శక్తి ఉంటుంది.. దానిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించి ప్రోత్సహించాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలి పారు. చిలకలూరిపేటలోని శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్ టీచర్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పవన్ విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. వారితో ప్రత్యేకంగా మాట్లాడారు. పాఠశాలలో గదులు, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యా యు లతో మాట్లాడారు. అనంతరం జరిగిన (మిగతా 8వ పేజీలో)



తల్లి.. టీచర్ పాత్ర కీలకం

చిన్నప్పుడు మా అమ్మ లైట్ వేయగానే దణ్ణం పెట్టుకునేది. చాలా సార్లు చూశాక ఎందుకమ్మా దణ్ణం పెట్టుకుంటున్నావు అని అడిగాను. ఎడిసన్ కనిపెట్టిన లైట్‌తో మనకు ఈ వెలుగులు.. అందు కని ఆయనకు దణ్ణం పెడుతున్నానని చెప్పింది. శాస్త్రజ్ఞులకు, మనకు మంచి భవిష్యత్ ఇచ్చిన వారికి కృతజ్ఞతగా ఉండాలని చిన్నప్పుడే తల్లి ద్వారా తెలుసుకున్నాను. నాకు చిన్నతనంలో సోషల్ టీచర్ సమాజం, దేశభక్తి గురించి చెప్పారు. ఈ రోజున ఇంత చేయగలుగుతున్నామంటే ఆ టీచర్ చెప్పిన చిన్న పాఠమే కారణం.

\- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

వినుకొండ ఆస్పత్రిలో తనిఖీలు

సంతృప్తి వ్యక్తం చేసిన నేషనల్ క్వాలిటీ బృందం

వినుకొండటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్ పరిశీలన అధికారులు తనిఖీలు చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించిన బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. రోగులకు అందిస్తున్న సేవల గురించి వైద్యాధికారి కేఎస్ దయానిధి ప్రత్యేకంగా వివరించారు. ఆస్పత్రిలోని ల్యాబ్‌ను అందంగా తీర్చి దిద్దడంపై ల్యాబ్ సిబ్బందిని కేంద్ర బృందం అభినందించింది. ఈ కార్యక్రమంలో క్వాలిటీ అధికారులు డాక్టర్ శరణప్ప, డాక్టర్ సెల్వితో పాటు అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యశాలలో స్టాల్స్‌ను పరిశీలిస్తున్న నేషనల్ క్వాలిటీ అధికారులు

ఎండుతున్న మిర్చి

- ఎండుతెగులుతో పంట తొలగింపు
- ఎకరాకు రూ.70వేల నష్టం అంటున్న రైతులు



పొలంలో ఎండిపోయిన మిరప మొక్కలు

వినుకొండటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆదాయమే లక్ష్యంగా మిర్చి పండిస్తున్న రైతుల గుండె ఎండుతోంది. ఆరుగాలం వేల రూపాయలు వెచ్చించి పండించిన మిర్చిని ఏటా బొబ్బ, నల్లి దోమ నుంచి పంటను బతికించుకోవడం భారంగా మారింది. మొన్న మొంథా తుఫాన్ తాకిడికి మండలంలోని దొండపాడు, పాకాలు, నడిగడ్డ, పానకాలపాలెం తదితర గ్రామాల్లో మిర్చికి ఎండు తెగులు సోకి మొక్కలు ఎండిపోయాయి. రైతులు పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. దొండపాడు గ్రామంలో మద్దుకూరి హరి, యండ్రపల్లి సుబ్బారావు, డొప్పలపూడి శ్రీను, సుబ్బారావు, మద్దుకూరి వెంకటేశ్వర్లు ఇలా చెప్పుకుంటూ పోతే ఒకొక్కరికి ఎకరం నుంచి నాలుగు ఎకరాల మేరకు మిర్చి పంటను ఎండు తెగులు సోకడంతో తొలగించాల్సి వస్తుంది. తొలినాళ్లలో కాసిన మిర్చి కాయలు ఎండుముఖం పట్టడంతో అది చూసిన రైతులకు చివరకు కన్నీరే మిగిలింది. ఎకరాకు ఇప్పటికే రూ.70వేలు వరకు పెట్టుబడి పెట్టామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై హార్టికల్చర్ అధికారి నబీరసూల్‌ను వివరణ కోరగా ఎండు తెగులు సోకి పంటలు ఎండిపోతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంటలను పరిశీలిస్తామని తెలిపారు.

పెట్టుబడి కూడా రాదు: డొప్పలపూడి శ్రీను, రైతు



గ్రామాల్లో రైతులు చిరుధాన్యాలకు బదులు మిర్చి పంట పండిస్తే.. పంట చేతికందే నాటికి కన్నీళ్లు వస్తున్నాయి. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఈ ఏడాది ఎండు తెగులు కారణంగా ఎకరాలు ఎకరాలు ఎండిపోవడంతో రోటోవేటర్ సాయంతో పంటలను తొలగిస్తున్నాం.

మార్చిలో టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు

డీఈఓ ఎల్.చంద్రకళ

నరసరావుపేట టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు వచ్చే ఏడాది మార్చి 2 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తామని డీఈవో ఎల్.చంద్రకళ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల పరీక్ష సమయం అని పేర్కొన్నారు. ఇక పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16 నుంచి 28వ తేదీ వరకు.. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్ విద్యార్థులు 1932 మంది, పదవ తరగతి 877 మంది పరీక్షకు హాజరవుతారని తెలిపారు. ఈ తేదీల్లోనే ఓపెన్ స్కూల్స్ ఇంటర్మీడియెట్, పదవ తరగతి పరీక్షలు కూడా నిర్వహిస్తామన్నారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ ఏప్రిల్ 11 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తామని చెప్పారు.

పులుల లెక్కింపు ప్రారంభం

వెల్దుర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో నల్లమల అటవీ ప్రాంత సమీపంలోని పులుల లెక్కింపును వైల్డ్ లైఫ్ అధికారులు చేపట్టారు. ఈ నెల ఒకటి నుంచి 8వ తేదీ వరకు పులుల గణన చేపడుతున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం మండలంలోని గుట్టుపల్ల బీట్ పరిధిలో పులుల పాద ముద్రలు సేకరించారు. అలాగే చిరుత పులులు, రేసు కుక్కలు, ఎలుగు బంట్లుతోపాటు పలు జంతువుల గణన కూడా చేయనున్నట్లు చెప్పారు.



పులుల పాదముద్రలను సేకరిస్తున్న అధికారులు

వచ్చే నెల 30న సైన్స్ ఎగ్జిబిషన్

- 30 ఏళ్ల అనంతరం గుంటూరు వైద్య కళాశాలలో ఏర్పాటు
- సీఎం చంద్రబాబుచే ప్రారంభం.. రెండు వారాలు నిర్వహణ

గుంటూరు మెడికల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంపై విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేలా గుంటూరు వైద్య కళాశాలలో జనవరి 30న సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిని ప్రారంభిస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి శుక్రవారం తెలిపారు. చివరి సారిగా 1996లో గుంటూరు మెడికల్ కాలేజీలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. తిరిగి ముప్పై ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వచ్చే జనవరిలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించాలని జీఎంసీ వర్గాలు నిర్ణయించాయి. రెండు వారాల పాటు పాఠశాలలు, కళాశాల విద్యార్థులతో పాటు సాధారణ ప్రజలు ఈ విజ్ఞాన ప్రదర్శనను తిలకించవచ్చు. అనాటమీ, ఫిజియాలజీ, పెథాలజీ, మైక్రోబయాలజీ వంటి నాన్‌క్లినికల్ విభాగాలతో పాటు మానవ శరీర అవయ వాల ప్రదర్శన వంటి అంశాలను ప్రదర్శనలో ఉంచుతారు. పలు రకాల శస్త్రచికిత్సల వీడియో ప్రదర్శనలు ఉంటాయి. వర్చువల్ రియాలిటీతో మరికొన్ని విజ్ఞాన ప్రదర్శనలు ఉంటాయి.

బీపీఎస్‌కు వెనకడుగు

బీపీఎస్ పీనల్ చార్జీలతో పాటు 14 శాతం ఓఎస్‌సీ ఫీజు చెల్లించాలని లైసెన్స్‌డ్ సర్వేయర్లు చెబుతుండటంతో భవన యజమానులు వెనకడుగు వేస్తున్నారు. 150 చదరపు గజాల భవనం ఉదాహరణగా తీసుకొంటే పీనల్ చార్జీలు వచ్చి రూ.1.60 లక్షలకు పైగానే లెక్కిస్తున్నారు. ఇక ఓఎస్‌సీ కింద అక్కడ భూమి విలువ రూ.20 లక్షలు ఉందనుకొంటే దానికి రూ. 2.80 లక్షలు ఒక అంతస్తుకు చెల్లించాల్సి ఉంటుంది. రెండు అంతస్తులు అయితే రెట్టింపు అవుతుంది. ఈ విధంగా చిన్న భవనాన్ని బీపీఎస్ కింద రెగ్యులరైజేషన్ చేసుకోవాలంటేనే దాదాపుగా రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ఎవరూ ముందుకు రావడం లేదు.



ప్రతిబంధకంగా ఓఎస్‌సీ ఫీజు

- భూమి విలువలో 14 శాతం అంటున్న నగరపాలక సంస్థ
- భారమవుతున్న పీనల్ ఫీజులు
- చిన్న భవనాలకే రూ.లక్షల్లో చెల్లింపు..

నరసరావుపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్(బీపీఎస్)కి గుంటూరు నగర పాలక సంస్థలో స్పందన కరువైంది. ఈ పథకం అమలులోకి వచ్చి దాదాపుగా 20 రోజులు గడిచిన ప్పటికీ భవన యజమానులు అంతగా ఆసక్తి ప్రద ర్శించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం ఓపెన్ స్పేస్ కంట్రిబ్యూషన్(ఓఎస్‌సీ) ఫీజు కారణమన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

కొన్ని సంవత్సరాల తర్వాత ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం బీపీఎస్‌ని గత నెల 12 నుంచి అమలులోకి తీసుకొచ్చింది. బేసిక్ పీనలైజేషన్ చార్జీల కింద 100 చదరపు మీటర్ల వరకు చదరపు మీటర్‌కు రూ.40, 101 నుంచి 300 చదరపు మీటర్ల వరకు రూ.60 పీనల్ చార్జీలను నిర్ణయించింది. 301 నుంచి 500 చదరపు మీటర్ల వరకు బిల్డింగ్ ప్లాన్ డీవియేషన్ 30 శాతం లోపు ఉంటే చదరపు మీటర్‌కు రూ.80, 30 శాతం కంటే ఎక్కువ/ప్లాన్ లేకుండా నిర్మించి ఉంటే రూ. 100 చొప్పున చెల్లించాలి. 501 నుంచి 1000 చదరపు మీటర్ల వరకు భవనాలకు 30 శాతం లోపు డీవియేషన్ ఉంటే చదరపు మీటర్‌కు రూ.100, అంతకంటే ఎక్కువ/ప్లాన్ లేకపోతే రూ.120 చెల్లించాలి. వెయ్యి చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన భవనాలకు 30 శాతం డీవియేషన్ లోపు ఉంటే రూ.150 చొప్పున, అంతకంటే ఎక్కువ/పూర్తిగా అనధికార నిర్మాణం అయితే రూ. 200 చొప్పున చెల్లించాలి. హాస్టల్స్, సర్వీసు అపార్టుమెంట్‌లు, డార్మిటరీలు, కమర్షియల్, ఇండస్ట్రియల్, (మిగతా 8వ పేజీలో)

అవినీతి చేస్తే.. చర్యలు తప్పవు

● మార్కెటింగ్ సిబ్బందికి డైరెక్టర్ విజయ సునీత హెచ్చరిక

● కాన్ఫరెన్స్ లో 'ఆంధ్రజ్యోతి' కథనం పై చర్చ

గుంటూరు సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'పత్తి రైతులు అసలే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమయంలో వారికి అండగా ఉండాల్సింది పోయి.. ఏదో ఒక రూపేణా పీడించడం ఏంటి? అవినీతి చేస్తే ఉపేక్షించేది లేదు.. చర్యలు తీసుకోవడానికి వెనుకాడేది లేదు.' అంటూ మార్కెటింగ్ సిబ్బందికి రాష్ట్ర డైరెక్టర్ విజయ సునీత వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. 'రూ.20 ఇస్తే.. పాస్ 'అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాష్ట్రంలోని మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, యార్డ్ సెక్రటరీలు, సూపర్ వైజర్లతో డైరెక్టర్ విజయ సునీత టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డబ్బులు కోసం రైతులను వేధిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించినట్లు తెలుస్తోంది. 'ఆంధ్రజ్యోతి 'కథనం పై విచారణ జరిపేందుకు ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన ఇద్దరు డిప్యూటీ డైరెక్టర్లను నియమించినట్లు సమాచారం.

ఫార్మసీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఈ ఏడాదిలో నిర్వహించిన ఫార్మసీ మొదటి సెమిస్టర్ రీవాల్యుయేషన్, ఫార్మసీ రెండోవ సంవత్సర రెగ్యులర్ పరీక్ష ఫలితాలను శుక్రవారం పరీక్షల నిర్వహణ అధికారి ఆలపాటి శివప్రసాద్‌రావు విడుదల చేశారు. ఫలితాలు ఏఎన్‌యూ వెబ్ సైట్ లో పొంది పరిచారు. సెకండ్ ఇయర్ రీవాల్యుయేషన్‌కు ఈ నెల 16 తేదీలోగా రూ.2,190 చెల్లించాలన్నారు. బీఏ ఎల్ఎల్‌బీ మొదటి సంవత్సరం రివ్యాల్యుషన్ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు.

నకిలీ హార్పిక్ స్వాధీనం

నరసరావుపేట లీగల్, డిసెంబరు 5, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో 15 సీసాల నకిలీ హార్పిక్ లైజాల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు నరసరావుపేట రెండో పట్టణ ఎస్ఐ సౌందర్రాజన్ శుక్రవారం తెలిపారు. ఆ కంపెనీ ప్రతినిధి ఫిర్యాదు మేరకు స్టేషన్ పరిధిలోని అన్ని దుకాణాలను తనిఖీ చేయగా.. మధు ట్రేడర్స్ కామాక్షి కిరణా స్టోర్లలో ఈ నకిలీ హార్పిక్ లైజాల్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్సాహంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

● సీనియర్స్ విభాగంలో విజేత సూర్యాపేట జిల్లా ఎడ్ల జత



మొదటి బహుమతి సాధించిన సూర్యాపేట జిల్లా ఎడ్లజత

గురజాలటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంచేసియున్న పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని పులిపాడు రోడ్డులోని బైపాస్ వద్ద రైతు సంఘాల ఆధ్వర్యాన ఎడ్ల బండలాగుడు పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సీనియర్స్ విభాగం పోటీలను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు లాంఛనంగా ప్రారంభించారు. మొత్తం 11 జతలు పాల్గొనగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేందర్‌రెడ్డి ఎడ్ల జత 1823.07 అడుగులతో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. కడప జిల్లా మురగుడికి చెందిన మారంరెడ్డి మహేశ్వరెడ్డి, కృష్ణా జిల్లా పెద్ద పులిపాకకు చెందిన గరికపాటి శ్రీధర్‌రెడ్డి సంయుక్త ఎడ్ల జత 1751 అడుగులతో రెండో స్థానం, బాపట్ల జిల్లా వేటపాలేనికి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత మూడోస్థానం, నంద్యాల జిల్లా హుస్సేనాపురం ఎడ్ల జత నాలుగోస్థానం, ప్రకాశం జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరస్వామి చౌదరి ఎడ్ల జత ఐదోస్థానం, పల్నాడు జిల్లా పులిపాడుకు చెందిన పెద్దినేని అమర నాగేశ్వరరావు ఎడ్ల జత ఆరోస్థానం దక్కించుకున్నాయి. మొదటిస్థానం సాధించిన ఎడ్లజత యజమానికి విక్టర్ బయో జెనిటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ తోట శ్రీనివాసరెడ్డి రూ.లక్ష నగదు బహూకరించారు. పోటీలకు వ్యాఖ్యాతలుగా సూరపనేని రాధాకృష్ణ, గూడా శ్రీనివాసరావు, అంపైర్‌గా పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి వ్యవహరించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆధునిక కిమ్స్ ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సెంటర్ ప్రారంభం

● సంతాన సాఫల్యత రంగంలో సేవలు





కిమ్స్ ఫెర్టిలిటీ ఐవీఎఫ్ సెంటర్‌ను ప్రారంభించి, జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వెంకటరమణ

గుంటూరు మెడికల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సంతాన సాఫల్యత రంగంలో అత్యున్నత ప్రమాణాలతో, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కిమ్స్ ఐవీఎఫ్ సెంటర్ అందుబాటులోకి రావడం అభినందనీయమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మీ తెలిపారు. శుక్రవారం కొత్తపేట యడవల్లివారి వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన కిమ్స్ ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సెంటర్‌ను ఏపీ ఫైర్ సర్వీస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ పి.వెంకట రమణ, డీఎంహెచ్‌వో విజయలక్ష్మీ ప్రారంభించారు. కిమ్స్ ఐవీఎఫ్ స్పెషలిస్ట్, అడ్వాన్స్‌డ్ రిప్రొడక్టివ్, ల్యాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ ఐ.నాగ ప్రత్యూష మాట్లాడుతూ అత్యాధునిక సంతాన సాఫల్యత వైద్య సేవలు కిమ్స్ ఫెర్టిలిటీ సెంటర్‌లో అందుబాట్లో ఉన్నట్లు తెలిపారు. ఇన్‌హౌస్ ఎంబ్రియాలజిస్టులు, స్టేట్ ఆఫ్ ఆర్ట్ ప్రమాణాలతో ఐవీఎఫ్ ల్యాబ్ ఉన్నాయని, ఐయూఐ, ఐవీఎఫ్, ఇక్సీ, డోనర్ ఎగ్ ఐవీఎఫ్ చికిత్సలు లభిస్తాయని తెలిపారు. ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ శిరీష గురిజాల మాట్లాడుతూ హైరిస్క్ ఇన్‌ఫెర్టిలిటీ కేసులకు చక్కటి పరిష్కారం కిమ్స్‌లో లభిస్తుందన్నారు. ఐవీఎఫ్ చికిత్సలతో పాటు భార్యభర్తల భావోద్వేగాలకు అనుగుణంగా తగిన కౌన్సెలింగ్ సేవలు కూడా అందిస్తామన్నారు. పలుమార్లు ఐవీఎఫ్ విఫలమైన కేసులకు, అధిక వయస్సు ఉన్న జంటలకు, పురుషుల్లో తీవ్రమైన లోపాలు ఉన్న కేసులకు కిమ్స్‌లో చక్కటి వైద్య సేవలు లభిస్తాయని తెలిపారు. కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధాకర్ జాదవ్ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఐదు కిమ్స్ ఐవీఎఫ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల హైదరాబాద్ జూబ్లీ హిల్స్ సెంటర్‌ను ప్రారంభించగా, గుంటూరు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కిమ్స్ శిఖర హాస్పిటల్ యూనిట్ హెడ్ హరికుమార్, ఎంబ్రియాలజిస్టులు ఎంఎల్ ఉదయ్, నసీమ్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

మానసిక, శారీరక వికాసానికి క్రీడల్లో పాల్గొనాలి

● ఉత్సాహంగా మహిళా వాలీబాల్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న వర్సిటీ పరిశీలకుడు ప్రకాశ్

తెనాలి అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో మానసిక, శారీరక వికాసానికి క్రీడల్లో పాల్గొనాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిశీలకులు డాక్టర్ ప్రీతమ్ ప్రకాశ్ పేర్కొన్నారు. జేఎంజే కళాశాలలో యూనివర్శిటీ అంతర్ కళాశాలల మహిళల వాలీబాల్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. 9 కళాశాలల నుంచి వాలీబాల్ జట్లు టోర్నమెంట్‌కు హాజరయ్యాయి. తొలి రోజు యూనివర్సిటీ జట్టుపై బాపట్ల ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు, ఆర్‌వీఆర్ జట్టుపై ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు, ఎ.సి. కళాశాల జట్టుపై బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల జట్టు, సెయింట్ అన్స్ కళాశాల జట్టుపై జేఎంజే కళాశాల జట్టు విజయం సాధించాయి. లీగ్ మ్యాచ్‌లో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల జట్టుపై 25-5, 25-10 స్కోరుతో జేఎంజే జట్టు విజయం సాధించింది. శనివారం ఫైనల్స్ జరగనుంది. సెలక్షన్ కమిటీ సభ్యుడు గౌరీశంకర్, కృష్ణ ప్రిన్సిపల్ సిస్టర్ శాంత, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ రోజలీన్, వ్యాయామ ఉపాధ్యాయులు అరుణసుజాత, రవీందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

గుంటూరు(విద్య), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం స్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడు ఎంపీ సుబ్బారావును సస్పెండ్ చేస్తూ డీఈఓ సీవీ రేణుక శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలో మెగా పేరేంట్స్ మీట్ సందర్భంగా అల్లరి చేస్తున్నారనే కారణంతో 6వ తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయుడు చేయి చేసుకోవడం, గిచ్చడం, బూటుకాలుతో విద్యార్థుల కాళ్లను తొక్కిన వీడియో సమాజిక మాధ్యమాల్లో వైరలైంది. విద్యాహక్కు చట్టం నిబంధనలు ఉల్లంఘించిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు డీఈఓ వెల్లడించారు.

అడ్వెంచర్ క్యాంపునకు.. వర్సిటీ వలంటీర్లు ఎంపిక

ఏఎన్‌యూ, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) వలంటీర్లు ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని అటల్ బిహారి వాజ్‌పాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అలైడ్ స్పోర్ట్స్‌లో జరిగే అడ్వెంచర్ క్యాంపునకు ఎంపికైనట్లు ఏఎన్యూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య వి.దివ్య తేజోమూర్తి శుక్రవారం తెలిపారు. ఈ క్యాంపులో ఏఎన్‌యూ ఫార్మసీ కళాశాలకు చెందిన కె.ప్రసన్నలక్ష్మి, సైన్స్ కళాశాల విద్యార్థి బి.వెంకటేష్ నాయుడు, ఆర్కిటెక్చర్ కళాశాల విద్యార్థి బిందుభారవి, గుంటూరు టీజేపీఎస్ కళాశాలకు చెందిన ఎన్.నరేష్, మంగళగిరి నిర్మల ఫార్మసీ కళాశాల నుంచి చల్లా కార్తికేయ, శ్రీరామ్, నాగార్జున సాగర్ ఏపీఆర్డీ కళాశాల నుంచి ఎస్.రవేంద్రనాథ్, గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల నుంచి బి.కీర్తి, కె.వెన్నెరురాణి, చౌడవరం ఆర్వీఆర్‌జేసీ కళాశాల నుంచి జె.హేమ, ఎం.మహేంద్రచౌదరి వాలంటీర్లుగా పాల్గొంటారని చెప్పారు. ఈ క్యాంపునకు ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ డి.కొండలరావు సారథిగా ఉంటారని చెప్పారు. వీసీ కె.గంగాధరరావు, రెక్టార్ ఆర్.శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ జి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో.. 19వ ఫ్లోర్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు



మాట్లాడుతున్న స్కూల్ చైర్మన్ డాక్టర్ ప్రకాష్‌రావు

నరసరావు పేట రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో 19వ ఫ్లోర్ బాల్ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషులు, మహిళల అంతర్ జిల్లాల పోటీలు ఈ నెల 6, 7వ తేదీల్లో జరుగుతాయని స్కూల్ చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్ రావు, డైరెక్టర్ సబితా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వారికి భోజన, వసతులు ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, ప్రత్యేక అతిథిగా కలెక్టర్ కృతికాశుక్లా హాజరవుతారని తెలిపారు. ఇక్కడ జరిగే పోటీలలో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర జట్టు క్రీడాకారులు జనవరి 4,5,6,7 తేదీల్లో న్యూ ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి ఫ్లోర్ బాల్ పోటీలలో పాల్గొంటారని వివరించారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ రేఖ పూలేకర్, జిల్లా ఫ్లోర్ బాల్ సెక్రటరీ ఎం. కిషోర్ బాబు, ఏపీ జాయింట్ సెక్రెటరీ పి. సురేంద్ర, కోచ్‌లు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రూ.140 కోట్ల దూది మాయం?!

● సీసీఐ మేనేజర్‌ను విచారించిన సీఐడీ

గుంటూరు సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కేంద్రాల్లో దూది మాయం వ్యవహారంపై విచారణ ఆరంభం అయ్యింది. శుక్రవారం సీసీఐ మేనేజర్‌ను సీఐడీ అధికారులు గుంటూరులోని కార్యాలయానికి పిలిపించారు. ఈ సందర్భంగా గత ఏడాది రాష్ట్రంలోని సీసీఐ కేంద్రాల్లో జరిగిన రూ. 140 కోట్ల దూది మాయానికి సంబంధించిన కీలక అంశాలపై ప్రశ్నించినట్లు తెలిసింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని వివిధ పద్ధతుల్లో కోత విధించడం, కొన్ని సందర్భాల్లో అదనపు దూది వచ్చినా దానిని ప్రభుత్వ ఖాతాలో జమ చేయక పోవడం వంటి కీలకమైన విషయాలపై విచారణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఆయా పద్ధతుల్లో అదనంగా వచ్చిన దూదిని బయ్యర్లు పక్కకు తీసి అమ్ముకొని సొమ్ము చేసుకోవడం అనే వ్యవహారం అసలు ఎన్ని రోజులుగా జరుగుతుంది.. అన్న దానిపై కూడా అధికార యంత్రాంగం దృష్టి సారించినట్లు సమాచారం. గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 3.75 లక్షల దూది బేళ్లు రాగా, అందులో సుమారు 40 వేల దూది బేళ్లు అడ్డ దారిలో అమ్మకాలు జరిగాయన్న ఆరోపణలకు బలం చేకూర్చే విధంగా అనేక కీలక ఆధారాలను సీఐడీ సేకరించినట్లు తెలుస్తోంది. సీసీఐ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ టీవీ ఫుటేజ్ కూడా విచారణ లో కీలకం కానున్నట్లు సమాచారం. మరి కొద్ది రోజుల్లోనే ఈ కేసులో కొన్ని సంచలనాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు అత్యంత విశ్వస నీయ వర్గాల ద్వారా తెలిసింది. కొందరు బయ్యర్ల మెడకు ఉచ్చు బిగుస్తున్నట్లు తెలుస్తుంది.

గేదెను ఢీకొని యువకుడి మృతి

దాచేపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తున్న యువకుడు గేదెను ఢీకొనటంతో తీవ్రంగా గాయపడి.. మృతి చెందిన ఘటన శుక్రవారం దాచేపల్లిలోని మాచర్ల టర్నింగ్ పెట్రోల్ బంకు సమీపంలో జరిగింది. మృతుడు రెంటచింతల మండలం మంచికల్లు గ్రామానికి చెందిన దాసరి బాల గోపీ(23)గా గుర్తించారు. పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రెండు గృహాల్లో చోరీ



వివరాలు వెల్లడిస్తున్న బాధితురాలు

కొల్లూరు, డిసెంబరు 5(ఆంధ్ర జ్యోతి): రెండు గృహాల్లో దొంగలు ఆభరణాలు దోచుకెళ్లిన ఘటన గురువారం మండలంలోని గౌడపాలెం లో అర్థరాత్రి చోటు చేసుకుంది. వృత్తిగత పనులపై ఊరికి వెళ్లి ఉదయం వచ్చిన బాధితులు ఇళ్లల్లో దొంగతనం జరిగి ఉండడాన్ని గుర్తించారు. జోగి వెంకటరమణ అనే మహిళ గృహంలో రూ.5 వేలు నగదు, వెండి మొలతాడు, వీరంకి మల్లేశ్వరి గృహంలో రూ.18 వేలు నగదు, 4 గ్రాముల బంగారు ఉంగారం దొంగతనం జరిగింది. మిగిలిన బంగారపు వస్తువులు మాత్రం ఉన్నట్లుగా బాధితులు తెలిపారు. చుండూరు సీఐ ఆనందరావు, ట్రైనీ ఎస్ఐ శ్రీనివాస్ చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

అనుమతుల్లేని పురుగు మందులు సీజ్

వినుకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ఆర్టీసీ బస్టాండ్‌లోని లాజిస్టిక్స్ పార్సిల్ కార్యాలయాలన్ని వ్యవసాయాధికరులు శుక్రవారం తనిఖీ చేశారు. అనుమతుల్లేని బీఏఎస్ఎఫ్ ఎక్సోపోనెస్ పురుగు మందును 3.32లీటర్లు వినుకొండ సహాయ సంచాలకు రవికుమార్ స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.2.43లక్షలు ఉంటుందని తెలిపారు. అలాగే రూ.57 వేలు విలువ గల ఎఫ్ఎంసీ మార్షల్ 36 లీటర్లు సీజ్ చేసి నమూనాలను ల్యాబ్‌కు పంపించారు.

నేడు తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవం

తెనాలి అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవం శనివారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ప్రారంభం కానుంది. రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాలను అభ్యుదయ సినీ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్, సృజనాత్మకత సంస్కృతి సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వైష్ణవి కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించే సభలో తొలిరోజు పలు కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. తెలుగు భాష- సాహిత్యం - వ్యక్తిత్వ వికాసంపై కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం తెలుగు ఆచార్యులు నారిశెట్టి వెంకటకృష్ణారావు, షిమి ఎడ్యుకేషనల్ ఓవర్‌సిస్ కన్సల్టెన్సీ సీఈవో దబ్బూరి నాగేశ్వరరావు, మొవ్వా సత్యనారాయణ, చింతల శ్రీనివాసరావు ప్రసంగిస్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల కవులతో కవితా గోష్టి నిర్వహిస్తారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు సైదారావు బృందం జుగల్‌బందితో శ్రోతలను అలరిస్తారు. సాయంత్రం సంగీత దర్శకుడు బొల్లిముంత కృష్ణ అధ్యక్షతన జరిగే సభలో రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ప్రజా సాహితీ సంపాదకుడు కొత్లపల్లి రవిబాబుకు పురస్కారాలు ప్రదానం చేస్తారు. తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ శ్రీకృష్ణదేవరాయలు పాత్ర పోషిస్తారని, భువన విజయం సాహితీ రూపకాన్ని ప్రదర్శిస్తారని ఫౌండేషన్ కన్వీనర్ చందు సుబ్బారావు తెలిపారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

● లోక్ సభలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టెట్ విషయంలో సుప్రీం కోర్టు ఆదేశాలను పునఃసమీక్ష చేసి.. ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చూడాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. శుక్రవారం లోక్‌సభ జీరో అవర్ సందర్భంగా.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం దేశంలోని సర్వీస్‌లో ఉన్న ప్రతి ప్రభుత్వ ఉపాధ్యాయుడు రెండేళ్లలోగా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సిందేననే నిర్ణయం ఉపాధ్యాయ వర్గాలలో తీవ్ర ఆందోళనకు దారితీసిందన్నారు. 2010 ఆగస్టు 23కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు అప్పటి ఆర్‌టీఈ చట్టం ప్రకారం టెట్ నుంచి మినహాయింపు ఇచ్చిన విషయం గుర్తుచేశారు. ప్రస్తుతం 15 నుంచి 30 ఏళ్ల అనుభవం ఉన్న గ్రామీణ, ఏజెన్సీ, గిరిజన ప్రాంతాలలో విద్యా వ్యవస్థను నిలబెట్టే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు మరోసారి టెట్ లాంటి ప్రవేశ పరీక్ష రాయాల్సిన పరిస్థితి కలగడం వారిని ఇబ్బందికి గురిచేసే అంశమన్నారు. ఆర్‌టీఈ చట్టం, ఎన్‌సీటీఈ చట్టం 1993లో సవరణలు చేసి 2010కు ముందు సర్వీసులలో నియమితులైన ఉపాధ్యాయులకు స్థిరమైన భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

సాతులూరు గూడ్స్ షెడ్డులో సకల సదుపాయాలు

● డీఆర్ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా సాతులూరు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన గూడ్స్‌షెడ్డులో అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని రైల్వే అధికారులను డీఆర్ఎం సుధేష్ణ సేన్ ఆదేశించారు. శుక్రవారం ఆమె రైల్వే ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సాతులూరు స్టేషన్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పనులను సమీక్షించారు. లోడింగ్, అన్‌లోడింగ్, యాక్సెస్ రోడ్డుకు సంబంధించి పనులు పూర్తి అయ్యాయని అధికారులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. వెండార్స్ వర్కర్స్, సేల్స్ ప్రమోటర్ తదితర గదుల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయన్నారు. సీసీ టీవీల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా అన్ని పనులు పూర్తి చేసి సాతులూరు గూడ్స్ షెడ్డుని వెండార్స్‌కి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. వెండార్స్ సరుకులు సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చుతామన్న భరోసా కల్పించాలని సూచించారు. ఏడీఆర్ఎం రమేష్ కుమార్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం డి.వినయ్‌కాంత్ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	143, 152, 163
చికెన్ విత్ స్కిన్(కిలో)	274.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	284.00

32,904 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 29,559 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 32,904 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,509 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000
నెంబరు. 5	11500	15500
273	---	----
341	10500	16500
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15800
షార్క్-1	-----	----
బ్యాడిగి	10500	17000
దేవనూరు డీలక్స్	11000	16500
ఆర్మూరు	10500	13200

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	16700
నెంబరు. 5	11000	15300
273	----	----
341	12000	16800
4884	12000	14200
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	11000	14800
బ్యాడిగి 355	11000	17200
దేవనూరు డీలక్స్	10500	16000
తాలుకాయలు	5000	7800

భక్తుల మనోభావాలను దెబ్బతీసిన జగన్

● భక్తులకు క్షమాపణ చెప్పాలి: ఎమ్మెల్యే యరపతినేని

రెంటచింతల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కలియుగ దైవం వేంకటేశ్వరుని సన్నిధిలో పరకామణి చోరీ కేసు చాలా చిన్నదిగా పేర్కొనడం జగన్ అజ్ఞానానికి నిదర్శనమని.. భక్తుల మనోభావాలను దెబ్బతీసి.. తప్పు చేసిన వ్యక్తులను వెనకేసుకురావడం మాజీ సీఎం జగన్‌కే చెల్లిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విమర్శించారు. శుక్రవారం తన స్వగ్రామమైన మంచికల్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగన్ పాలనంతా అవినీతిలో కూరుకుపోవడం వల్ల ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎటువంటి అవినీతి మచ్చలేని చంద్రబాబును 53 రోజుల జైల్లో పెట్టి మాజీ సీఎంగా జగన్ పైశాచిక ఆనందం పొందారని..అందుకే.. 11 సీట్లకే ఆ పార్టీ పరిమితమైందన్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద డబ్బు చెల్లించవద్దు

● మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిర్వాహకులకుగాని, మిల్లర్లుగాని ఎవరికి డబ్బు చెల్లించవద్దని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం పారిదర్శకంగా కొనుగోలు చెయ్యాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్దేశమన్నారు. రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని.. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల నుంచి ఎవరైన డబ్బు డిమాండ్ చేసినట్లు గుర్తిస్తే 87126 55890, 89856 49598 ఫోన్ నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రమాద ఘటన పై సమగ్ర విచారణ చేయిస్తాం

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నాదెండ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి పైన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులు మృతి చెందటం అత్యంత బాధాకరమని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతి చెందిన విద్యార్థులు తమ విద్యా సంస్థలకు చెందిన వారు కావడం మరింత బాధిస్తుందన్నారు. ఈ ఘటనకు గల కారణాలపై సమగ్ర విచారణ చేయిస్తామని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా అండగా ఉంటామని పేర్కొన్నారు. గాయ పడిన కార్తీక్ కూడా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

సీఎం రిలీఫండ్ చెక్కు అందజేత

విజయపురిసౌత్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొందిన విజయపురిసౌత్‌లోని గౌడ బజారుకు చెందిన వినుకొండ సిద్ధశ్రీ సీఎం రిలీఫండ్‌కు దరఖాస్తు చేసుకుంది. ఈ మేరకు మంజూరైన రూ.53,778 విలువైన చెక్కును ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం టీడీపీ విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్ల వెంకటేశ్వర్లు చౌదరి ఆమెకి అందజేశారు. కార్యక్రమంలో ఆడెపు కోటయ్య, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు షైలపల్లి అప్పలరాజు, రావుల శ్రీను, రామ్‌చంద్, మస్తాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి బావుల్లో క్లోరినేషన్

మాచర్ల రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడులో మలేరియా అసిస్టెంట్ మురళీధర్, గ్రామ సెక్రటరీ సురేష్‌బాబు ఆధ్వర్యాన మంచినీటి బావుల్లో శుక్రవారం క్లోరినేషన్ చేశారు. కలుషితమైన నీటి ద్వారా వ్యాధులు రాకుండా క్లోరినేషన్ చేశామన్నారు. ప్రజలు బావులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్పర్ సత్యానందం, వెలనాటి నరసింహారావు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చర్లగుడిపాడు - జనార్ధనపురం రహదారి పనుల ప్రారంభం

గురజాలటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చర్లగుడిపాడు-జనార్ధనపురం రహదారి పనులను శుక్రవారం కూటమి నేతలు ప్రారంభించారు. ఎమ్మెల్యే యరపతినేని రూ.1.18 కోట్ల నిధులను మంజూరు చేయించి పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నేతలు జాస్తి ప్రకాష్, వీరనారాయణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

11న నూతన ఎంపీపీ ఎన్నిక

● ఎంపీడీవో విష్ణు చిరంజీవి

మాచవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మాచవరం మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 11వ తేదీన నూతన ఎంపీపీ ఎన్నిక జరుగుతుందని ఎంపీడీవో విష్ణు చిరంజీవి శుక్రవారం తెలిపారు. ఇప్పటివరకు ఎంపీపీగా పనిచేసిన దారం అంబులమ్మ అనారోగ్య కారణాలతో మృతిచెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నుంచి నూతన ఎంపీపీ ఎన్నికపై ఇప్పటికే ఆదేశాలు వచ్చాయన్నారు. కార్యక్రమానికి మండల పరిధిలోని ఎంపీటీసీలు హాజరుకావాలని ఆయన కోరారు.

పిడుగురాళ్ల ఐఎంఏకు జాతీయస్థాయి గౌరవం

పిడుగురాళ్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల ఐఎంఏ శాఖ అధ్యక్షుడు ధూళిపాళ్ల భరత్‌కుమార్‌కు జాతీయ స్థాయి గౌరవం లభించింది. ఈ మేరకు ఐఎంఏ జాతీయ ప్రధాన కార్యదర్శి సర్బారీ దత్త అందించిన వివరాల ప్రకారం దేశవ్యాప్తంగా అన్నిశాఖలలో విశిష్ట నాయకత్వం, సభ్యుల సమన్వయం, శాఖ అభివృద్ధిలో చూపిన సేవలను గుర్తించి కొన్ని ఐఎంఏ శాఖల అధ్యక్షులకు జాతీయ స్థాయి గౌరవానికి ఎంపిక చేశారు. ఆ జాబితాలో పిడుగురాళ్ల ఐఎంఏ శాఖ అధ్యక్షుడు భరత్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ నెల 27న గుజరాత్‌లో ఆయనకు అవార్డును అందజేయనున్నారు.

ఘనంగా ఘంటసాల జయంతి

క్రోసూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అమర గాయకుడు స్వర్గీయ పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని శుక్రవారం క్రోసూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల కళా సమితి ఆధ్వర్యంలో అమరావతి బస్టాండ్ సెంటర్‌లో చిత్రపటానికి పూల దండలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు శిఖా శ్యామ్‌సన్, నాయకులు షేక్ మస్తాన్, శ్రీనివాసరావు, జానీ బాషా, కూనల నాగరాజు, అంజనేయులు, గనుపల్లి రాజశేఖర్, పోతుగంటి లక్ష్మయ్య, నందిగం దేవదాసు, షేక్ జములా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి దివ్యాంగుల పాలాభిషేకం

క్రోసూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు చిత్రపటానికి శుక్రవారం మండలంలోని దొడ్లేరులో దివ్యాంగులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మొగల్‌జాన్ మాట్లాడుతూ దివ్యాంగులకు ట్రై సైకిళ్ళు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన సీఎం చంద్రబాబుకు దివ్యాంగులందరూ రుణపడి ఉంటారన్నారు. దివ్యాంగుల అర్హతను బట్టి రూ.4వేల నుంచి రూ.16వేల వరకు పెన్షన్‌లను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు దాచేపల్లి చందు, వై విష్ణుమూర్తి, కే కరిముల్లా, వెంకటేశ్వర్లు, పీకలయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

సత్తెనపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే న్యాయవాద పరిరక్షణ చట్టాన్ని తేవాలని కోరుతూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల పై జరుగుతున్న దాడులను ఖండించారు. కార్యక్రమంలో గంగూరి అజయ్ కుమార్, పిన్నం మణిబాబు, జానీ ఖాజావలి, నరసింహారావు, అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.

నకరికల్లు డిప్యూటీ ఎంపీడీవోగా శశికళ

నకరికల్లు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుళ్ళూరు మండలం అనంతవరం గ్రామ పంచాయతీ గ్రేడు - 1 పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్న అంకిరెడ్డి శశికళను డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి కల్పిస్తూ నకరికల్లుకు బదిలీ చేశారు. నకరికల్లు పంచాయతీ కార్యదర్శిగా ఉన్న ప్రసాదు పదోన్నతిపై ముప్పాళ్ళ జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిగా శుక్రవారం విధుల్లో చేరారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించడమే లక్ష్యం

● ఎమ్మెల్యే యరపతినేని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

గురజాలటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన విద్యనందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పులిపాడు హైస్కూల్‌లో నిర్వహించిన మెగా టీచర్స్ పేరెంట్స్ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక మంత్రి లోకేశ్ విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో విద్యారంగంలో వెలుగులు వచ్చాయన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి ఆర్డీవో మురళీకృష్ణ, డీఎస్పీ జగదీష్‌లతో కలిసి భోజనం చేశారు. ప్రతి రోజు ఇలాగే రుచిగా వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. స్కూల్ మైదానాన్ని పరిశీలించారు. మండలంలోని గంగవరంలో నిర్వహించిన మెగా టీచర్స్ పేరెంట్స్ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని సచివాలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ దుర్గేశ్వరరావు, నాగార్జున సాగర్ కుడికాలువ చైర్మన్ పులుకూరి కాంతారావు, టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, మద్దినేని లక్ష్మీనారాయణ, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రారంభం

గురజాల గ్రామ దేవత శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా పులిపాడు రోడ్డులో రైతు సంఘాల ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన 32వ వార్షికోత్సవ ఎడ్ల బండలాగుడు పోటీలను శుక్రవారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. పోటీలను వీక్షించేందుకు వచ్చిన రైతుల వద్దకు వెళ్లి మాట్లాడారు. అనంతరం రైతులకు పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగార్జునసాగర్ కుడికాలువ చైర్మన్ పులుకూరి కాంతారావు, టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, జనసేన నియోజక వర్గ సమన్వయకర్త కటికం అంకారావుపాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకుందాం

రెంటచింతల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అనాదిగా వస్తున్న ఆచారాలు, సంప్రదాయలను కాపాడుకుని భవిష్యత్ తరాలకు గుర్తుండేలా చేద్దామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కోరారు. మంచికల్లు పోలేరమ్మ తిరునాళ్లలో భాగంగా ఏడో రోజైన శుక్రవారం గ్రామంలో కుంకుమబళ్ళను కట్టారు. తొలుత ఎమ్మెల్యే పూజలు నిర్వహించి వీ.దుల్లో కుంకుమబండ్ల ఊరేగింపును ప్రారంభించారు. స్వయంగా కుంకుమబండి ట్రాక్టర్‌ను నడిపారు.

విద్యార్థులపై బాధ్యతారాహిత్యం తగదు

● విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి
● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

దుర్గి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై బాధ్యతారాహిత్యం తల్లిదండ్రులకు తగదని, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధచూపి సరైనమార్గంలో నడిచేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో విద్యాశాఖాధికారుల ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన పీటీఎం ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని హైస్కూల్లో సరస్వతిదేవి విగ్రహం వద్ద పూజలు జరిపారు. విద్యార్థుల స్టాల్స్‌ను పరిశీలించారు. కూటమి ప్రభుత్వంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మౌలిక వసతులకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. నైతిక విలువలతో విద్యార్థులు ముందుకు సాగేలా ప్రభుత్వం బాటలు వేస్తోందన్నారు. దుర్గిలో రూ.70లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి భూమిపూజ చేశారు. ముటుకూరు రోడ్డులో నిర్మిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆలయ ప్రాంగణంలో ఆక్రమణకు గురైన స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. దేవాలయ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో ఎస్సీ కమిషన్ సభ్యుడు మేకల దాసు, జడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, ఎంపీపీ యేచూరి సునీతాశంకర్, జానకిరామయ్య, లింగా రమేష్, యెల్లెబోయిన రమణ గోపాల్, మాగులూరి నారయ్య, సూరే వెంకటేశ్వర్లు, సింగు నాగేశ్వరరావు, ఆకుల చిన్న చెన్నయ్య, లింగా బ్రహ్మయ్య, పులి హరి, గర్నె రమేష్, రుద్రాల రవి, పసుమర్తి బుజ్జి, యాగంటి నరేష్, కటకం రామారావు, మాడుగుండ్ల వేణుగోపాల్, లింగా వెంకటేశ్వర్లు, ఎలీషా బాబు, వంకమళ్ల కోటేశ్వరరావు, దేవరగట్టు బ్రహ్మయ్య, వెలిదండి గోపాల్‌రావు, శ్రీరాం కాశిబాబు, బ్యంగా రామాంజినేయులు, గుమ్మా ఆంజనేయులు, భీమా అమరయ్య, తహసీల్దార్ కరుణకుమార్, ఎంపీడీవో సుగుణ, ఎంఈవో బెంజిమెన్ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● ఎమ్మెల్యే ప్రవీణ్



అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

బెల్లంకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పాపాయపాలెంలో వంద రోజులు వంద గ్రామాల కార్యక్రమానికి విచ్చేశారు. ముందుగా గ్రామంలో మహాలక్ష్మమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఒక మహిళ తమ వీధి బురదమయంగా తయారైందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ శుక్రవారం సాయంత్రం లోపు గ్రావెల్ తోలించి వీధిని బాగుచేయాలని ఇన్‌చార్జ్ సెక్రటరీని ఆదేశించారు. మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధి చెందాయంటే కూటమి ప్రభుత్వ కృషేనన్నారు. మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం నుంచి వెంకటాయపాలెం వరకు వెళ్ళే జడ్పీరోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు.

కష్టపడి చదివితేనే భవిష్యత్ బాగుంటుంది

బెల్లంకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివితేనే భవిష్యత్ బాగుంటుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పాపాయపాలెం జడ్పీ హైస్కూల్లో విద్యార్థుల తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాఠశాలలపై ప్రత్యేకదృష్టి పెట్టిందని పేర్కొన్నారు. విద్యార్థులు గురువులను, తల్లిదండ్రులను, ఇంటిలో పెద్దలను గౌరవించాలన్నారు. ప్రతి ఒక్కరు బాగా చదువుకొని తల్లిదండ్రులకు, పాఠశాలలకు, గ్రామానికి మంచిపేరుతీసుకురావాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ ప్రవీణ్, ఎంపీడీవో సునీత, రాజ కుమారి, ఎంఈవో-2 బాల సుందరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అక్కల వెంకటరామిరెడ్డి, ప్రసాదరావు, వెంకటరావు, బ్రహ్మారెడ్డి, నాగమల్లేశ్వరరావు, రాజేష్, సత్యనారాయణ, అప్పయ్య, అయ్యప్ప, నాగుల్‌మీర, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మస్తాన్‌షరీఫ్, వెన్నా సీతారామిరెడ్డి, గుడిసె కొండయ్య, ఆనంద్, ఆసుల జగన్, హనుమంతరావు, మేశం శ్రీరామూర్తి, వెన్నా వెంకటరెడ్డి, రసూల్, రాజేష్, జ్యోతిసముద్రం, బలరామిరెడ్డి, సయ్యద్‌హసాన్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలికల హైస్కూల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం బడివైపు ఒక అడుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. దీని విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు దగ్గర చేసి విద్యార్థుల అభ్యసన ప్రయాణంలో జవాబు దారి తనాన్ని పెంపొందించటం జరుగుతుందన్నారు. పాఠశాలల్లో అదనపు గదులను కన్నా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తరగతి గదిలో విద్యార్థులతో కలసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు, దరువూరి నాగేశ్వరరావు, శంకరరావు, వెంకటకోటయ్య, మస్తాన్‌వలి, కంభాల వెంకటేశ్వరరావు, అంబిక, నూర్‌బాషా జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

సత్తెనపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండవ వార్డుకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రెండవ వార్డులో శుక్రవారం కూటమి ముఖ్య నాయకులు, సచివాలయ ఉద్యోగులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ంచేస్తున్న సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. వార్డులో సమస్యలు ఉంటే తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. అనంతరం తన కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో కన్నా వినతి పత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చౌట శ్రీనివాసరావు, మస్తాన్‌వలి, నూర్ బాషా జానీ బాబు, గుర్రం వెంకటేశ్వరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.



తాళం వేసి ఉన్న ఆరోగ్య కేంద్రం

ఆరోగ్య కేంద్రానికి తాళం కూడా తీయలేదు..

గురజాలటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరంలో గల గ్రామీణ ఆరోగ్య కేంద్రానికి శుక్రవారం తాళం కూడా తీయలేదు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శుక్రవారం గ్రామానికి వచ్చినా సిబ్బంది మాత్రం కార్యాలయానికి తాళం తీయలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆయిల్ ఫాం సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

● అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త డాక్టర్ సైదానాయక్



ఆయిల్ ఫాం పంటలను పరిశీలిస్తున్న అగ్రికల్చర్ రిసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త డాక్టర్ వీ సైదానాయక్ తదితరులు

మాచవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిల్‌పాం, మిరపసాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని.. అప్పుడే తక్కువ దిగుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త డాక్టర్ వీ సైదానాయక్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని పిన్నెల్లి, మాచవరం గ్రామాల్లో మిర్చి, ఆయిల్ పాం పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరపలో రసం పీల్చే పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆయిల్ పాం ఫీల్డ్ స్టాఫ్ నాగేంద్ర, నాగరాజు, ఉద్యాన సహాయకులు సాగర్‌బాబు, ప్రభాకర్ రెడ్డి, వ్యవసాయ సహాయకులు జానీ బాషా, ప్రియాంక పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టమూరు ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కార్యకర్త దుద్దుల హైమావతి ఆత్మహత్యకు యత్నించింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన వివరాలిలా ఉన్నాయి. వారం రోజుల క్రితం కేంద్రంలో ఆడుకుంటున్న చిన్నారుల్లో ఒక పాప వేడిగా ఉన్న పప్పుకూరపై పడింది. దీంతో పాప శరీరభాగం కాలింది. అంగన్‌వాడీ కార్యకర్త నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని గ్రామస్తులు సంబంధిత శాఖ కాల్ సెంటర్‌కు ఫోన్‌చేశారు. అధికారులు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్ళి విచారణ చేపట్టారు. హైమావతి నిర్లక్ష్యం వల్ల ఘటన జరిగిందని నిర్ధారించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. దీంతో గురువారం హైమావతిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మనస్థాపానికి గురైన హైమావతి అదే రోజు నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం సత్తెనపల్లిలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. హైమావతిని కలెక్టర్ సస్పెండ్ చేసిన మాట వాస్తవమేనని, ప్రస్తుతం ఆమె ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆషా శుక్రవారం తెలిపారు.

మున్సిపల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ నేత ఉమామహేశ్వరరావు

పిడుగురాళ్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికుల ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పిడుగురాళ్ల ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 31వ తేదీ నుండి జనవరి 4వ వరకు విశాఖపట్టణంలో సీఐటీయూ 18వ జాతీయ మహాసభలు జరుగనున్నాయన్నారు. ఈ సమావేశాలలో సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. సివిల్ సప్లై హమాలీ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు తెలగపల్లి శ్రీను, బత్తుల రామారావు, మార్తమ్మ, సుజాత, బత్తుల అనిల్‌కుమార్, కంపా సాగర్‌బాబు, దేవళ్ల చిన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే సమాజాభివృద్ధి

● పీటీఎం ఆత్మీయ సమావేశంలో వక్తలు

అచ్చంపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్య ద్వారానే సమాజ అభివృద్ధి జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం అన్నారు. శుక్రవారం పలు పాఠశాలల్లో మెగా పేరెంట్స్ సమావేశాలు జరిగాయి. అచ్చంపేట కేజీబీవీల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పలువురు నాయకులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థినిల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ దీప్తి, విద్యా కమిటీ చైర్మన్ మందా క్రీస్తురాజు, బాపిరాజు, వెనిగండ్ల కోటయ్య, ఆంజనేయులు, సందెపోగు గాంధీ, పసుపులేటి పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.జడ్పీ హైస్కూల్, అంబేద్కర్ గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను కార్యక్రమాలు నిర్వహించారు. అచ్చంపేట ఎంపీయూ పాఠశాలలో చైర్మన్ సందెపోగు సాయికుమారి తదితరులు పాల్గొన్నారు. మాదిపాడు జడ్పీ హైస్కూల్లో కార్యక్రమంలో ఎంపీడీవో కే శ్రీనివాసరావు, ఎంఈవో ఏకుల ప్రసాదరావు, హెచ్‌ఎం పూర్ణచంద్రరావు, విద్యాకమిటీ చైర్మన్ కుమార్, మన్నెం భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

● అమరావతి: మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, గురుకుల పాఠశాలల్లో పీటీఎం సమావేశం ఘనంగా జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ఎం హనుమంతరావు, ఎంపీడీఓ శివపార్వతి, ఎంఈఓలు ప్రసాద్, శివబాబు ముఖ్యఅతిధులుగా ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ సైదా, ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ మేరీకళ పాల్గొన్నారు.



అమరావతి: మాట్లాడుతున్న ఎంపీపీ హనుమంతరావు

● క్రోసూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం పీటీఎం 3.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో జీ కృష్ణ క్రోసూరు మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాల, హసానాబాద్ జడ్పీ హైస్కూళ్ళ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా పాఠశాలల్లో తల్లిదండ్రుల ప్రశ్నలకు ఉపాధ్యాయులు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఎంపీపీ కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీల, ఎంపీడీవో జీ రవికుమార్, ఎంఈవో-2 జీ గణేష్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

● పెదకూరపాడు: తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా మెలగాలని, పిల్లల పనులను గమనించాలని మండల టీడీపీ అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. పెదకూరపాడులోని జడ్పీ హైస్కూల్‌లో మెగా పీటీఎం హెచ్‌ఎం కాకాణి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడిపూడి రాజు, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, మాజీ ఎంపీటీసీ షేక్ ముంతాజ్, షేక్ అక్బర్, స్కూల్ కమిటీ చైర్మన్ షేక్ విదయ తుల్లా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకాలను తిలకించారు.

టీడీపీ హయాంలోనే దాచేపల్లి అభివృద్ధి

● కల్యాణ మండపం భూమిపూజలో ఎమ్మెల్యే యరపతినేని



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలో జరిగిన అభివృద్ధి పనులన్నీ కూటమి ప్రభుత్వంలోనే జరిగాయని, ఈ ప్రాంతంలోని కాపులందరూ కూటమి ప్రభుత్వ గెలుపుకు కృషిచేశారని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం 3వ వార్డులో చేపట్టిన కాపు కల్యాణ మండపం భూమిపూజలో ఆయన పాల్గొని శంకుస్థాపన చేశారు. అనంతరం సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో పిడుగురాళ్ళ, గురజాల, దాచేపల్లి, మాచవరం మండలాల్లో కాపు కల్యాణ మండప భవన నిర్మాణాలకు రూ.కోట్ల విలువైన స్థలాలు, రూ.50లక్షల నిధులు మంజూరుచేశామన్నారు. కాపులు టీడీపీ ఎప్పుడూ అండగా ఉందన్నారు. పార్టీ, నామినేటెడ్ పదవుల్లో కాపులకు అవకాశం ఇచ్చి సముచిత స్థానాన్ని కల్పించారు. కార్యక్రమంలో తంగెళ్ళ శ్రీనివాసరావు, బెల్లంకొండ బద్రి, మునగ నిమ్మయ్య, బొమ్మిరెడ్డి నారాయణ, అహమద, కొప్పుల గిరి, పగడాల భాస్కరరావు, వేముల తిరుమలకుమార్, తోట వెంకటేశ్వర్లు, రుద్రాల అచ్చారావు, బుర్రి సురేష్, వెలిశెట్టి అప్పారావు, అంబటి శేషగిరిరావు, వలి, పురంశెట్టి పరంజ్యోతి, కూరాకుల నాగేశ్వరరావు, వేముల వినోద్‌రెడ్డి, అంబటి మల్లి, మామిడి చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు సంస్కృతిని ప్రపంచానికి చాటుదాం

● టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి



నాయకురాలు నాగమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీటీడీ బోర్డు సభ్యులు జంగా

దాచేపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పల్నాడు చరిత్రను, సంస్కృతిని, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పాలని టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి కోరారు. శుక్రవారం నాయకురాలు నాగమ్మ జయంతిని పురస్కరించుకొని దాచేపల్లిలోని నాగమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభకు 14వ వార్డు కౌన్సిలర్ షరీఫ్ అధ్యక్షత వహించారు. జంగా మాట్లాడుతూ నాయకురాలు నాగమ్మ నిర్మించిన దేవాలయాలు, చెరువులు, చారిత్రక కట్టడాలను భావితరాలకు వారసత్వ సంపదగా ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ జంగా కోటయ్య, నర్ర పుల్లయ్య, కొప్పుల గిరి, మునగ నిమ్మయ్య, సొసైటీ నారాయణ, తోట వెంకటేశ్వర్లు, మాశెట్టి బుజ్జి, బెహరా శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన

● మెగా పీటీఎం సమావేశంలో నేతలు

పిడుగురాళ్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన జరుగుతుందని పిడుగురాళ్ల పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్డవల్లి సర్వేశ్వరరావు తెలిపారు. శుక్రవారం పిడుగురాళ్ల జడ్‌పి పాఠశాలలో మెగా పీటీఎం సమావేశం జరిగింది. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ వీరస్వామి, పిల్లి చెన్నారావు, వడ్డవల్లి సాంబశివరావు, అంజాసాహెబ్, సయ్యద్ అమీర్‌అలి, షేక్ సైదా, హెచ్‌ఎం చల్లగుండ్ల శంకరనారాయణ, ఆత్మకూరి కాశీవిశ్వనాథం పాల్గొన్నారు. జూలకల్లు, గుత్తికొండ, కరాలపాడు, తుమ్మలచెరువు, బ్రాహ్మణపల్లి, జానపాడు, పీవీపాలెం తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించారు.

● మాచర్ల: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని వీరభద్రాపురం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేశవరెడ్డి, ఆవుల వెంకటేశ్వర్లు, శాంతకుమారి, కొమెర శివ, గట్ల కోటిరెడ్డి, గొబ్బూరి ఏడుకొండలు, బచ్చు శ్రీను, గోలి వెంకటేశ్వర్లు, పిన్నంశెట్టి కృష్ణ, చెన్న పాల్గొన్నారు. పట్టణంలోని వాణీ విద్యానికేతన్‌లో జరిగిన పీటీఎం సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్ హాజరయ్యారు. ప్రిన్సిపాల్ రమణ, డైరెక్టర్ అంజనాదేవీ పాల్గొన్నారు.

● విజయపురిసౌత్: విద్యార్థులకు ఉత్తమ విద్యనందించడమే ధ్యేయమని స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాల హెచ్‌ఎం జ్యోతి అన్నారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్స్ ఆత్మీయ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, ఎస్ఎంసి చైర్మన్ రామ్‌చంద్‌నాయక్, ఆడెపు కోటయ్య, షైలపల్లి అప్పలరాజు, బొబ్బిలి చంద్రశేఖర్, హరనాథ్‌బాబా, కట్టారాజు, గంటా ధనుంజయరావు, మస్తాన్ పాల్గొన్నారు. స్థానిక సాగర్ క్యాంపు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఎరిపల్లి వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం రాజేశ్వరి, బొడ్డి సత్తిబాబు, చిట్టిబాబు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

● రెంటచింతల: పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తల్లిదండ్రులు సూచనలు ఇవ్వాలని అప్పుడే బిడ్డలు ఉన్నతి వైపు వెళ్తారని ఎంఈవో 2 శివనాగేశ్వరరావు చెప్పారు. శుక్రవారం మండలంలోని పాఠశాలలో మెగా పీటీఎం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో బీజేపీ నేత ఇగుటూరు రాజశేఖరరెడ్డి, గోవిందుబాలస్వామి, సైదయ్య పాల్గొన్నారు.

● మాచవరం: మండలంలోని అన్ని ప్రభుత్వపాఠశాలల్లో శుక్రవారం పీటీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల ప్రగతి, విద్యార్థుల చదువులు, ఉపాధ్యాయుల ప్రాధాన్యత గురించి వివరించారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి రూరల్: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పీటీఎం సందడిగా జరిగింది. తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధి, విద్యాభివృద్ధి చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్‌లు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి

బెల్లంకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు భూసారాలను మెరుగుపరుచు కోవటానికి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జిల్లా శిక్షణ కో-ఆర్డినేటర్ కే అమలకుమారి పేర్కొన్నారు. శుక్రవారం బెల్లంకొండలో రబీ డ్రై కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సోయింగ్ కిట్స్ వినియోగం వల్ల రబీ పంటలకు మంచి స్థాపన లభిస్తుందని తెలిపారు. అనంతరం రైతులతో కలసి కిట్లు తయారీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం బెల్లంకొండలో ఏర్పాటుచేసిన మోడల్ షేక్ మేకర్ హాజరాబీ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో నందకుమార్, పవన్, అనంతలక్ష్మి, కరీమూన్, సైదా బాబు తదితరులు పాల్గొన్నారు.

మహేష్ మృతికి సంతాపం

పిడుగురాళ్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నాదెండ్ల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన శివరాత్రి మహేష్ మృతదేహాన్ని పట్టణంలోని కూటమి నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు వడ్డవల్లి సర్వేశ్వరరావు, తురకా వీరాస్వామి, పిల్లి చెన్నారావు, దేవళ్ల రాంబాబు, కుంచపు నాగలింగేశ్వరరావు, వల్లెపు రామకృష్ణ, నెకరికంటి శివ, కార్ సైదా, బిజిలి వెంక్రటావులు మహేష్ తల్లిదండ్రులను ఓదార్చారు.

రిటైర్డ్ వీఆర్వో మేకపోతుల కృష్ణారెడ్డి మృతి



కృష్ణారెడ్డి (ఫైల్)

రెంటచింతల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జెట్టిపాలెం గ్రామానికిచెందిన రిటైర్డ్ వీఆర్వో మేకపోతుల కృష్ణారెడ్డి (74) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య వరలక్ష్మమ్మ, ముగ్గురు సంతానం ఉన్నారు. తహసీల్దార్ మేరీ కనకం, వీఆర్వోలు, వివిధ పార్టీల నేతలు మృతదేహానికి నివాళులర్పించారు.

ఆమెరికాలో గుంటూరు అందం

● మిసెస్ తెలుగు యూఎస్ఏ-2026కు దొప్పలపూడి వినీల ఎంపిక



దొప్పలపూడి వినీల

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అమెరికా తెలుగు అందాల పోటీల్లో గుంటూరు సౌందర్యం ప్రతిభ చాటింది. యూఎస్ఏ తెలుగు జాతీయ స్థాయి సౌందర్య పోటీల సంస్థ.. 2026 మిస్, మిసెస్ తెలుగు యూఎస్ఏ పోటీలకి సర్వ సన్నద్ధమైంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలుగు మహిళా మణులకు ఎంతో ఆసక్తి కలిగించే ఈ పోటీల్లో అమెరికా సంయుక్త రాష్ట్రాలతో పాటుగా ఇతర దేశాల్లోని వారూ పాల్గొంటారు. ఈ ప్రతిష్టాత్మక పోటీలకు అమెరికా అంతటా జరిగిన ఎంపిక ప్రక్రియలో 22 మంది ఫైనల్ లిస్ట్ అయ్యారు. వీరిలో గుంటూరు మహిళ దొప్పలపూడి వినీల స్థానం దక్కించుకున్నారు. వినీల స్వగ్రామం తుళ్లూరు మండలం హరిశ్చంద్రాపురం. ఆమె కుటుంబ సభ్యులు ప్రస్తుతం గుంటూరులో స్థిరపడ్డారు. దొప్పలపూడి వినీలకు మిసెస్ తెలుగు యుఎస్ఏ-2026లో స్థానం లభించడంతో.. మహిళా సౌందర్యంలోనూ 'గుంటూరు' పేరు చాటిన వినీలను ప్రవాసాంధ్రులు, పుర ప్రముఖులు అభినందిస్తున్నారు. దొప్పలపూడి వినీల అంజమ్మ, నరసింహారావు దంపతులకు జన్మించారు. గుంటూరులో పుట్టి పెరిగి, చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు. ఉన్నత చదువుల కోసం 2016లో అమెరికా వలస వెళ్లి, ప్రస్తుతం బీఐ డెవలపర్‌గా పనిచేస్తున్నారు. వినీల అమెరికాలో వివిధ స్థానిక సౌందర్య పోటీలలో పాల్గొని విజయాలు సాధించారు. ఆమె ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ పోటీలలో ప్రతిభ కనబరిచారు. వినీల మరిన్ని విజయాలు సాధించాలని కుటుంబ సభ్యులు అభిలాషిస్తున్నారు.

గిరిజన ప్రపంచం ఉద్భవం

● ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు చిన్నారుల ప్రదర్శనలతో ఆవిష్కృతం

● ఘనంగా ముగిసిన ఉద్భవ్- 2025 వేడుకలు

● బహుమతుల ప్రదానోత్సవంలో రాష్ట్ర మంత్రులు సంధ్యారాణి, దుర్గేష్, డీబీవీ స్వామి


బహుమతులు అందుకుంటున్న తెలంగాణ విద్యార్థులు


బహుమతులు అందుకుంటున్న ఒడిస్సా విద్యార్థులు


బహుమతులు అందుకుంటున్న త్రిపుర విద్యార్థులు

తాడేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మరో అద్భుతమైన వేడుక ఆంధ్రప్రదేశ్‌లో ముగిసింది. గిరిజన విద్యార్థుల ఆట పాటలు, వారి సంస్కృతి, సాంప్రదాయాలు ఒకే వేదికపై కనువిందు చేశాయి. అడవి బిడ్డల్లో దాగిన ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పేందుకు కేఎల్ యూనివర్సిటీ వేదికగా గత బుధవారం కేంద్ర గిరిజన శాఖ మంత్రి జువల్ ఓరమ్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఉద్భవ్ 2025 వేడుకలు శుక్రవారం ముగిశాయి. జాతీయ స్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఇఎంఆర్ఎస్) సాంస్కృతిక ఉత్సవాలు ఏపిలో తొలిసారిగా నిర్వహించారు. 22 రాష్ట్రాల నుంచి 1647 మంది విద్యార్థులు.. ఏపీలోని 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి ఎంపికైన 110 మంది తమ ప్రతిభను చాటారు. ఆఖరి రోజు బహుమతి ప్రదానం కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రులు సంధ్యారాణి, కందుల దుర్గేష్, బాల వీరాంజనేయస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. దేశ నలుమూలల నుంచి విచ్చేసిన గిరిజన విద్యార్థులు తమ రాష్ట్ర ఆచార వ్యవహారాలను ప్రతిబింబిస్తూ నిర్వహించిన ప్రదర్శలు అలరించాయి. కేరళ నుంచి వ్యవసాయ కార్యక్రమాల సమయంలో నిర్వహించే కళారూపం ఎన్నవనట్, బిహార్ నుంచి విద్యార్థినులు దీపావళి నృత్యం జుమ్మర్, గుజరాత్ గిరిజన నృత్యం మాల్దా, తెలంగాణ సాంప్రదాయ లంబాడి జానపద పాటలు, నృత్యాలు.. నేపాల్ తార్ గిరిజన పాటలు, త్రిపుర రియాంగ్ గిరిజన సమాజం నుంచి ఉద్భవించిన హోజాగిరి తదితర నృత్యాలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ, ఒడిశా, త్రిపుర విద్యార్థులు అత్యధికంగా బహుమతులు సాధించారు. మొత్తం 49 విభాగాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఓవరాల్ ఛాంపియన్‌గా తెలంగాణ నిలిచింది. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మల్లికార్జున నాయక్, ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి గౌతమి, నెస్ట్ సహాయ కార్యదర్శి బిపిన్ రాటూరి, రంపచోడవరం ఐటీడీఏ పీడీ స్మరణ్‌రాజ్, కేఎల్‌యూ ప్రోవీసీ వెంకటరామ్ తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త ఆరంభమే ఉద్భవ్

● కందుల దుర్గేష్, మంత్రి, టూరిజం, సినిమాటోగ్రఫీ

గిరిజన చిన్నారుల నైపుణ్యాలను ప్రోత్సహించి, వారిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఉద్భవ్ 2025 వేదికైంది. ఇలాంటి జాతీయ స్థాయి కార్యక్రమానికి ఏపీ వేదిక కావడం గర్వించే విషయం. సరికొత్త ఆరంభమే ఉద్భవ్ అన్న మాటకు అర్థం. అడవిలో పుట్టి పెరిగిన వారు సైతం అత్యున్నత శిఖరాలు అధిరోహించాలి. పీఎం మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశంలో ఇలాంటి గొప్ప వేడుక జరుపుకోవడం గర్వించదగ్గ అంశం.

ఉద్భవ్ ఓ అద్భుత ఈవెంట్

● గుమ్మడి సంధ్యారాణి, మంత్రి, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ

భిన్న సంస్కృతులు, విభిన్న సాంప్రదాయాలున్న మనమంతా ఒక్కటే. ఆదివాసీలు ఎవరికీ తక్కువ కాదని నిరూపించేలా జరిగిన ఉద్భవ్-2025 ఓ అద్భుత ఈవెంట్. స్వాతంత్ర్య సమర యోధులు అల్లూరి సీతారామరాజు, బిర్సా ముండా లాంటి వారు ఆదర్శం. యోగాలో 108 సార్లు సూర్య నమస్కారాలు చేసి గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు సాధించింది ఆదివాసీలే. అరకు కాఫీని లక్షల ఎకరాల్లో పండించి.. అంతర్జాతీయ ఖ్యాతి పొందింది గిరిజనుల కృషితోనే. గిరిజన విద్యార్థుల్లో కళా నైపుణ్యాలు వెలికి తీసి వారికి ఉన్నతస్థాయి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి సంధ్యారాణి

సమగ్రతకు, ఐక్యతకు నిదర్శనం

● డీబీవీ స్వామి, మంత్రి, సాంఘిక సంక్షేమం

ఉద్భవ్‌కు ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం ఇవ్వడం చాలా గర్వంగా ఉంది. 22 రాష్ట్రాల నుంచి విద్యార్థులు హాజరుకావడం జాతీయ సమగ్రతకు, ఐక్యతకు నిదర్శనం. ఈ వేడుకల ద్వారా లభించిన విశ్వాసాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. వేదికపై నిలబడినప్పుడే గిరిపుత్రులు విజేతలయ్యారు. యువభారతం మీ కోసం ఎప్పుడూ ఎదురు చూస్తుంది.


విద్యార్థులు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

నాటి నాసిరకం వైన్‌ం మారింది!

● ప్రస్తుతం క్వాలిటీ, బ్రాండ్ల విషయంలో మెరుగ్గా మద్యం దుకాణాలు

● ప్రైవేట్ దుకాణాల్లో పెరిగిన విక్రయాలు, అధునాతన సౌకర్యాలు

● వైసీపీ జమానాలో నాసిరకం మద్యం అమ్మకాలు

● క్యాష్ ఇస్తేనే..మద్యం డిజిటల్ పేమెంట్లకు నో..

● బార్ల యజమానులతో ప్రభుత్వ వైన్ షాపుల సిబ్బంది కుమ్మక్కు..

● కావాల్సిన బ్రాండ్లకు బార్లకు వెళ్లాల్సిందే..







నాడు వైసీపీ హయాంలో ప్రభుత్వ వైన్ షాపుల దుస్థితి

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మద్యం అమ్మకాల్లో కాలానుగుణంగా అనేక మార్పులు వస్తున్నాయి. వైసీపీ హయాంలో మద్యం షాపులలో కోరిన బ్రాండ్ దొరికేది కాదు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రస్తుతం ఏ బ్రాండ్ కావాలంటే ఆ బ్రాండ్ మద్యం దొరుకుతుంది. గతంలో కేవలం నగదుకు మాత్రమే అమ్మకాలు జరిగేవి. ఇప్పుడు మద్యం షాపుల వద్ద అన్ని రకాల డిజిటల్ పేమెంట్లు ఉన్నాయి. 2023 సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు మాసాల్లో అప్పటి ప్రభుత్వ దుకాణాల్లో జరిగిన అమ్మకాలకు.. కూటమి ప్రభుత్వ హయాంలో ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు త్రైమాసికానికి ప్రైవేటు మద్యం దుకాణాల అమ్మకాలను బేరీజు వేస్తే ఎంతో వ్యత్యాసం ఉంది. 2023లో గుంటూరు జిల్లాలో రూ.251.30 కోట్ల అమ్మకాలు జరగ్గా.. ఈ ఏడాది అదే మూడు నెలల్లో రూ.325.98 కోట్ల అమ్మకాలు జరిగాయి. దీని ప్రకారం అప్పటి కంటే ఇప్పుడు సుమారు రూ.74 కోట్లకు పైగా అమ్మకాలు జరిగాయి. అదే విధంగా పల్నాడు జిల్లాలో 2023లో రూ. 214.90 కోట్ల అమ్మకాలు జరగ్గా, ఈ ఏడాది రూ. 251.30 కోట్ల విక్రయాలు జరిగాయి. సుమారుగా రూ. 36 కోట్లకు పైగా అమ్మకాలు పెరిగాయి. దీనికి ప్రధాన కారణం గతంలో ప్రభుత్వ వైన్ షాపుల నిర్వాహకులతో అప్పటి బార్ యజమానులు కుమ్మక్కయ్యేవారు. ఆ బార్లు ఎక్కువ శాతం వైసీపీ నేతల ఆధ్వర్యంలో ఉండేవి. దీంతో ప్రభుత్వ దుకాణాల్లో మద్యం అమ్మకాలు అంతగా జరిగేవి కాదు. సమయం ప్రకారం షాపులను తెరిచి మూసేసేవారు. అంతే కాకుండా కోరుకున్న మద్యం కూడా దొరికేది కాదు. దీంతో అప్పట్లో మద్యం బాబులంతా బార్ల వైపు చూసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వైన్స్ బార్లు మొత్తం ప్రైవేట్ పరం చేయడంతో పోటీ పెరిగి మద్యం బాబులకు అన్ని రకాల బ్రాండ్లు విస్తారంగా దొరుకుతున్నాయి.

● నేడు అధునాతనంగా

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రస్తుతం ప్రైవేటు వైన్ షాపులు కొత్త హంగులతో మెరిసిపోతున్నాయి. వైసీపీ హయాంలో వైన్ షాపులు పాడుబడిన షాపుల్లో, ఇనుప గ్రిల్స్ మాటున అమ్మకాలు జరిగేవి. మధ్య తరగతి మద్యంబాబులు సైతం అక్కడికి వెళ్లి క్యూ లైన్‌లలో నిలబడి కొనుగోలు చేయాలంటే సిగ్గుపడే పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం మద్యం టెండర్లు నిర్వహించి బార్లు, వైన్ షాపులు కేటాయించింది. వైన్ దుకాణాల మధ్య పోటీ తత్వంతో అధునాతన హంగులతో మాల్స్‌ను తలపించేలా వైన్ షాపులు గుంటూరులో వెలిశాయి. వైన్ షాపుల వద్ద పర్మిట్ రూమ్‌లు కూడా అనుమతి ఇచ్చారు. బార్లలో కూడా అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. కొత్త మోడల్స్‌లో బార్లను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.. దీంతో మందు బాబులు బార్లకు వెళ్లి హాయిగా మద్యాన్ని పుచ్చుకుంటున్నారు.

● అప్పుడు ఓన్లీ క్యాష్


కూటమి ప్రభుత్వంలో అధునాతన హంగులతో వెలసిన వైన్ షాపులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైన్ షాపులు నిర్వహించి వాటిల్లో కేవలం నగదుకు మాత్రమే మద్యం అమ్మకాలు జరిపించారు. దీంతో మందు బాబులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. సకాలంలో షాపులు తీయకుండా, బ్రాండ్లు అందుబాటులో లేకుండా నాసి రకం (జే బ్రాండ్) మద్యం అమ్మకాలు జరిపించారు. పరోక్షంగా బార్ల నిర్వాహకులకు భారీగా లాభం చేకూరే విధంగా ప్రభుత్వ వైన్ షాపుల నిర్వాహకులు సహకరించారు. ఈ క్రమంలో భారీ మొత్తంలో అక్రమాలు జరగటం, అనేక చోట్ల వైన్ షాపుల్లో పనిచేసే వర్కర్స్ చోరీలకు పాల్పడటం జరిగింది. ఫలితంగా రాష్ట్ర ఖజానాకు చేరాల్సిన డబ్బు అంతా జగన్ ఇలాకాకు చేరింది. క్యాష్ అమ్మకాలలో కూడా భారీగా అవకతవకలు జరిగాయి. అప్పటి అధికార పార్టీ పెద్దలు, అధికారులు పెద్ద ఎత్తున సొమ్ము చేసుకున్నారు. నేడు ఆ విధానానికి స్వస్తి పలికి కూటమి ప్రభుత్వం అన్ని రకాల డిజిటల్ పేమెంట్స్ ద్వారా మద్యం కొనుగోలుకు చెల్లించే విధంగా నిర్ణయం తీసుకుంది. క్రెడిట్ కార్డులను కూడా అనుమతిస్తుండటంతో ఉద్యోగులకు మరింత సౌలభ్యంగా ఉంది. అప్పట్లో కోరుకున్న మద్యం తాగాలంటే బార్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది, నేడు ఆ పరిస్థితి లేదు అన్ని రకాల బ్రాండ్లన్నీ వైన్ షాపులలో దొరుకుతున్నాయి.

షిర్డీకి మరో రెగ్యులర్ వీక్లీ రైలు



గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మీదగా వారంలో ఒక రోజు షిర్డికి రెగ్యులర్ రైలుని నడిపేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. తిరుపతి నుంచి ఈ రైలు ప్రతీ ఆదివారం షిర్డికి బయలుదేరుతుంది. అలానే షిర్డి నుంచి ప్రతీ సోమవారం తిరుపతికి ప్రయాణమవుతుంది. తిరుపతి - సాయినగర్ షిర్డి రైలుకు నంబరు. 17425ని కేటాయించగా సాయినగర్ షిర్డి - తిరుపతి రైలుకు నంబరు 17426గా నిర్ణయించింది. ఈ నెల 14వ తేదీ నుంచి ప్రతి ఆదివారం 17425 తిరుపతి - సాయినగర్ షిర్డి రైలు వేకువజామున 4.23కి బయలుదేరుతుంది. ఈ రైలు ఉదయం 8.48కి చీరాల, 9.53కి తెనాలి, 10.40కి గుంటూరు, 11.49కి సత్తెనపల్లి, 12.19కి పిడుగురాళ్ల, 12.39కి నడికుడి, మధ్యాహ్నం 3.50కి సికింద్రాబాద్, సాయంత్రం 4.48కి లింగంపల్లి, అర్ధరాత్రి దాటాక 12.30కి పర్లి వైజ్‌నాథ్, సోమవారం వేకువజామున 6.15కి ఛత్రపతి శంభాజీనగర్, 7.55కి నాగర్‌సోల్, 9.50కి మన్మాడ్, 10.45కి సాయినగర్ షిర్డి చేరుకొంటుంది.

17426 సాయినగర్ షిర్డి - తిరుపతి రైలు ఈ నెల 15 నుంచి ప్రతి సోమవారం రాత్రి 7.35కి బయలుదేరి మంగళవారం వేకువజామున 4 గంటలకు పర్లీ వైజ్‌నాథ్, ఉదయం 11.10కి సికింద్రాబాద్, మధ్యాహ్నం 2.29కి నడికుడి, 3.01కి పిడుగురాళ్ల, 3.39కి సత్తెనపల్లి, సాయంత్రం 5.10కి గుంటూరు, 6.28కి తెనాలి, రాత్రి 7.23కి చీరాల, అర్ధరాత్రి దాటాక 1.30(బుధవారం)కు తిరుపతి చేరుకొంటుంది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా రైలు ప్రయాణికులకు ఆదివారం షిర్డికి, మంగళవారం తిరుపతికి రైలు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. ఈ రైళ్లలో ఏసీ టూటైర్, త్రీటైర్, స్లీపర్, జనరల్ బోగీలుంటాయి.

9, 10 తేదీల్లో ప్రత్యేక రైళ్లు

ఈ నెల 9న నంబరు 07425 తిరుపతి - సాయినగర్ షిర్డి ప్రత్యేక రైలు ఉదయం 11.10కి బయలుదేరి సాయంత్రం 5.50కి గుంటూరు, 6.58కి సత్తెనపల్లి, రాత్రి 7.58కి పిడుగురాళ్ల, 8.29కి నడికుడి, అర్ధరాత్రి దాటాక 12.30కి సికింద్రాబాద్, మరుసటి రోజు సాయంత్రం 6.35కి సాయినగర్ షిర్డి చేరుకొంటుంది. 07426 సాయినగర్ షిర్డి - తిరుపతి ప్రత్యేక రైలు ఈ నెల 10న బుధవారం రాత్రి 10.20కి బయలుదేరి గురువారం సాయంత్రం 4.25కి సికింద్రాబాద్, రాత్రి 7.34కి నడికుడి, 7.59కి పిడుగురాళ్ల, 8.29కి సత్తెనపల్లి, 9.15కి గుంటూరు, శుక్రవారం ఉదయం 8.30కి తిరుపతి చేరుకొంటుంది. రెగ్యులర్, ప్రత్యేక రైళ్ల కారణంగా 07637 తిరుపతి - సాయినగర్ షిర్డి ప్రత్యేక రైలు ఈ నెల 14, 21, 28, 07638 సాయినగర్ షిర్డి - తిరుపతి ప్రత్యేక రైలు ఈ నెల 15, 22, 29 తేదీల్లో రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు.

1 నుంచి కొండవీడు ఎక్స్‌ప్రెస్ కాలమాన పట్టిక మార్పు

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వారంలో మూడు రోజుల పాటు గుంటూరు మీదగా ప్రయాణించే 17212 యశ్వంత్‌పూర్ - మచిలీపట్నం కొండవీడు ఎక్స్‌ప్రెస్ కాలమాన పట్టికని జనవరి ఒకటి నుంచి మార్పు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ రైలు ప్రస్తుతం యశ్వంత్‌పూర్‌లో మధ్యాహ్నం 1.15కి బయలుదేరుతుంది. జనవరి ఒకటో తేదీ నుంచి మధ్యాహ్నం 12.45కే బయలుదేరి నరసరావుపేటకు అర్ధరాత్రి దాటాక 12.24కి, గుంటూరుకు ఒంటిగంటకు వస్తుంది. అనంతరం విజయవాడ, గుడివాడ మీదుగా వేకువజామున 5.15 గంటలకే మచిలీపట్నం చేరుకుంటుంది. దాదాపుగా 1.45 గంటల ప్రయాణ సమయాన్ని రైల్వే శాఖ తగ్గించిందని సీపీఆర్‌వో తెలిపారు.

బీటెక్ విద్యార్థులకు కన్నీటి వీడ్కోలు

(5వ పేజీ తరువాయి)

నాగరాజులకు ఒక్కగానొక్క కుమారుడైన వాసు మృతితో వారు కన్నీటి పర్యంతమవుతున్నారు. మహేష్‌బాబు తండ్రి తాపీమేస్త్రీగా పనులు చేస్తూ కుమారుడు మహేష్‌బాబును ఇంజనీరింగ్ చదవిస్తున్నారు. కాగా తల్లి గృహిణి. మహేష్ మృతితో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

ఆ కారు ఎవరిది?

నాదెండ్ల: గణపవరం గ్రామ పరిధిలో కుప్పగంజి వాగు సమీపంలో జరిగిన రోడ్డు ఘోర ప్రమాదానికి ఓ కారు కారణమని తెలుస్తోంది. ఘటనకు సంబంధించి సీసీ పుటేజ్‌లు శుక్రవారం వెలుగుచూశాయి. ముందు వెళ్తున్న ఓ కారు ఆగగా ట్రాక్టర్లను తరలిస్తున్న కంటైనర్ స్లో అవుతున్న సమయంలో విద్యార్థులు ప్రయాణిస్తున్న కారు కంటైనర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదం తర్వాత కంటైనర్ ముందున్న కారు వెళ్లిపోయింది. కాగా ఆ కారు ఎవరిదనే విషయం తెలియాల్సి ఉంది.

బీపీఎస్‌కు వెనకడుగు

(5వ పేజీ తరువాయి)

ఇనిస్టిట్యూషనల్ బిల్డింగ్‌లకు వేర్వేరుగా పీనల్ చార్జీలను ప్రభుత్వం నిర్ణయించింది. అలానే అపార్టుమెంట్‌లు, కాంప్లెక్స్‌లకు కూడా వేర్వేగా చార్జీలు ఉన్నాయి.

160 దరఖాస్తులు

బేసిక్ పీనలైజేషన్ ఛార్జీలు ఆగస్టు 31వ తేదీ నాటికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం విలువ ప్రకారం చదరపు గజం రూ.50 వేల కంటే ఎక్కువగా ఉంటే 100 శాతం, రూ. 25,001 నుంచి రూ. 50 వేల లోపు ఉంటే 90 శాతం, రూ. 10,001 నుంచి రూ. 25 వేల లోపు ఉంటే 80 శాతం, రూ.5001 నుంచి రూ.10 వేల మధ్యన ఉంటే 70 శాతం, రూ.1001 నుంచి రూ.5 వేల లోపు ఉంటే 60 శాతం, రూ. వెయ్యి లోపు ఉంటే 50 శాతం చెల్లించాలి. ఎవరికైతే భూమి విలువ డాక్యుమెంట్‌లో తక్కువగా ఉంటుందో వారికి కొంత ఉపశమనంగా ఈ చార్జీలు ఉన్నాయి. అయితే ఎటొచ్చి 14 శాతం ఓపెన్ స్పేస్ కంట్రిబ్యూషన్‌ని దీనికి లింకు చేయడంతోనే స్పందన కరువైంది. ఇప్పటి వరకు కేవలం 160 దరఖాస్తులు మాత్రమే అందాయంటే స్పందన ఎంత తక్కువ స్థాయిలో ఉందో కళ్లకు కడుతున్నది. భవనాలు ఈ మధ్యన నిర్మించినవి కావు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించి అనుభవిస్తున్నవి. అన్నిరకాల పన్నులు కూడా చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో 14 శాతం ఓపెన్ స్పేస్ కంట్రిబ్యూషన్‌ని తొలగిస్తే స్పందన అనూహ్యంగా పెరిగే అవకాశం ఉన్నట్లుగా లైసెన్స్‌డ్ సర్వేయర్లు చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరుతున్నారు.

విద్యార్థుల్లో శక్తిని గుర్తించాలి


విద్యార్థుల ప్రదర్శనలు తిలకిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే పుల్లారావు, కలెక్టర్ కృతికా శుక్లా

(5వ పేజీ తరువాయి)

సభలో ఆయన ప్రసంగించారు. స్వయం శక్తితో ఎదిగేలా విద్యార్థుల మనస్సు, ఆలోచనలను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పాఠాలు చెప్పగలిగితే ఎంతోమంది అద్భుతమైన వ్యక్తులు వస్తారన్నారు. విద్యార్థుల ఆలోచనలు.. ప్రవర్తన.. వ్యక్తితం రేపటి దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు. పీటీఎం విద్యారంగంలో కీలకమైన మార్పని దీని వల్ల విద్యార్థుల్లోని బలాలు.. బలహీనతలు ఏమిటినదే తల్లిదండ్రులు తెలుసుకోగలరన్నారు. అబ్దుల్‌కలాం లాంటి వారి స్ఫూర్తిగా ప్రతీ విద్యార్థి ఎదగాలన్నారు. సమాజాన్ని కదిలించే శక్తి చదువు ఇస్తుందన్నారు. మానసిక దారుఢ్యం రావాలంటే పుస్తకాలు బాగా చదవాలని విద్యార్థులకు తెలిపారు. అమెరికాలో ఉంటున్న గోరంట్ల వాసు పాఠశాలకు విరాళంగా ఇచ్చిన పరికరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సైన్స్ ప్రదర్శన జుబేదా, రిహానా, స్మృతి, రత్నకుమారి, గౌసియా అనే విద్యార్థినులను అభినందించారు.

పవన్‌తో సినిమా తీయాలనుకున్నా : పుల్లారావు

తాను రాజకీయాల్లోకి రాకముందు పవన్ కల్యాణ్‌తో సినిమా తీయాలనుకున్నానని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పవన్ కోసం చిలకలూరిపేట ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూశారని ప్రస్తుతం వారి కోరిక నెరవేరిందన్నారు. సభలో పంచాయతీరాజ్ కమీషనర్ కృష్ణతేజ, ఇంటర్ బోర్డు డైరెక్టర్ రంజిత్‌బాషా, జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా, ప్రధానోపాధ్యాయురాలు రత్నభారతి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణతేజ తాత పేరుతో చౌక్ అద్భుతం

పీటీఎంలో పాల్గొనేందుకు 10 నుంచి 12 ఊర్లు చెప్పారు. చిలకలూరిపేటను ఎంచుకున్నాను. అయితే మా సొంత ఊరు చిలకలూరిపేటకు వస్తున్నారని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ గురువారం రాత్రి తనకు చెప్పారని పవన్‌కల్యాణ్ చెప్పారు. కృష్ణతేజ తాత మైలవరపు గుండయ్య వందల కోట్ల విలువైన స్థలాలను నాడు ప్రజా అవసరాలకు ఇవ్వడం చాలా గొప్పగా ఉందన్నారు. ఆయన పేరుతో మైలవరపు గుండయ్య చౌక్ పేరు చూశానని, గడియార స్తంభం కనిపిస్తే అడిగితే వారు ఏవరో కాదు కృష్ణతేజ తాత అని తెలుసుకున్నానన్నారు. ఒకరి పేరుపై చౌక్ పెట్టారంటే వారెంతో సేవ చేసి ఉండాలన్నారు. తోట రాఘవయ్య తన కూతురు పేరుపై శారద స్కూల్ కోసం ఎకరం స్థలం ఇవ్వడం అభినందనయమన్నారు. గతంలో పెద్దలు విద్యాసంస్థలకు పెద్దఎత్తున స్థలాలు ఇచ్చే వారని, ఇప్పుడు ఉన్న స్థలాలను లాగేసుకుంటున్నారన్నారు.

విద్యార్థులతో మమేకం..

శారదా పాఠశాలలో జరిగిన మోగా పేరెంట్ టీచర్స్ మీట్‌లో పాల్గొన్న పవన్‌కల్యాణ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులో మమేకమయ్యారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ఎగ్జిబిట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. క్రీడా సామగ్రి పరిశీలించి బేస్‌బాల్ బ్యాట్‌ను చేతపట్టి పరీక్షించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో ముచ్చటించారు. డిజిటల్ బోర్డులను ఆసక్తిగా గమనించగా వాటి పనితీరును ఉపాధ్యాయులు ఆయనకు వివరించారు. లైబ్రరీలో బీరువాలను పరిశీలించి వాటికి సరిపడా పుస్తకాలు లేకపోవడాన్ని గుర్తించారు. పవన్ కల్యాణ్‌కు తొలుత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు.. ఉపాధ్యాయులు, కలెక్టర్ కృతికాశుక్లా, డీఈవో చంద్రకళ స్వాగతం పలికారు.

కలెక్టర్‌కు అభినందనలు

హర్యానాకు చెందిన కలెక్టర్ కృతికాశుక్లా తెలుగు మాట్లాడుతున్నారు. ఆమె మాటలు చూస్తే గుంటూరు.. విజయవాడ అనుకున్నాను. ఎక్కడో హర్యానా నుంచి వచ్చి మన మాతృభాష తెలుగు నేర్చుకుని మాట్లాడుతుంటే సంతోషంగా ఉందంటూ పవన్‌కల్యాణ్ కృతికా శుక్లాను వేదికపైనే ప్రత్యేకంగా అభినందించారు.



ఆత్మీయ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే పుల్లారావు, కలెక్టర్ కృతికా శుక్లా




గౌరవ వందనం స్వీకరిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఆర్వో ప్లాంట్లలో మున్సిపల్ అధికారుల తనిఖీ

వినుకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పురపాలక సంఘ పరిధిలో ఆర్వో ప్లాంట్లను మున్సిపల్ అధికరులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఆర్వో ప్లాంట్ల ద్వారా ప్రజలకు విక్రయిస్తున్న నీటి టీడీఎస్ రిపోర్ట్, ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, ప్లాంట్ కరెంటు బిల్లు, వాటర్ ఫిల్టర్స్, షెడ్యూల్ డైరీ, బీఐఎస్ సర్టిఫికెట్స్ తదితర వివరాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 8వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో జరిగే సమావేశానికి ఆర్వో ప్లాంట్ నిర్వాహకులు నిబంధనల ప్రకారం అన్ని అనుమతి పత్రాలతో హాజరుకావాలని తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

అనుమతులు లేని హోర్డింగులకు జరిమానా: మునిసిపల్ కమిషనర్

నరసరావుపేట రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో అనుమతులు లేని హోర్డింగులకు జరిమానా విధించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ మాట్లాడుతూ నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో శాశ్వత, తాత్కాలిక హోర్డింగుల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగులకు రోజుకు రూ.50 వేలు చొప్పున జరిమాన విధించడం జరుగుతుందని తెలిపారు. పట్టణంలో ప్రదర్శించే ప్రతి హోర్డింగులపై ప్రింటింగ్ ప్రెస్ పేరు, సంప్రదింపు మొబైల్ నెంబరు, జీఎస్టీ నెంబరు, అనుమతి సంఖ్య తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

అంగన్వాడీ కార్యకర్త మృతి


రాజ్యలక్ష్మి (ఫైల్‌ఫొటో)

ఈపూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబాలెం గ్రామానికి చెందిన అంగన్వాడీ కార్యకర్త రాపర్ల రాజ్యలక్ష్మి (55) గురువారం మృతిచెందింది. రాజ్యలక్ష్మి శుభకార్యానికి వెళ్లి వస్తూ గత నెల 24వ తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడింది. గుంటూరు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతురాలికి భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు.

రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలి: ఏడీఏ శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ కేవీ శ్రీనివాసరావు తెలిపారు. నరసరావుపే మండలంలోని యల్లమందలో ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా రైతులకు నేల స్వభావం, పంటల సాగు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐ.శాంతి, నరసరావుపేట సాయిల్ టెస్టింగ్ వ్యవసాయ అధికారి యాకోబు, వ్యవసాయ విస్తరణాధికారి కే బ్రహ్మయ్య, వ్యవసాయ సహాయకులు అంజలి, సుసాంజనేయులు తదితరులు హాజరయ్యారు.

క్లుప్తంగా...

● నరసరావుపేట రూరల్, రొంపిచర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనెపూడిలో శుక్రవారం సాయంత్రం, రొంపిచర్ల మండలం ఆరేపల్లి గ్రామంలో గురువారం రాత్రి నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో సెమీ క్రిస్మస్ వేడుకలు గురువారం రాత్రి జరిగాయి. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు కార్యక్రమానికి హాజరయ్యారు.

● నూజెండ్ల: మండలంలోని కంభంపాడు గ్రేడు-1 పంచాయతీ కార్యదర్శిగా సేవలు అందిస్తున్న జీ బాల కోటేశ్వరరావు డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతిపై శుక్రవారం బదిలీ అయ్యారు. గత 12 సంవత్సరాలుగా నూజెండ్ల మండలంలో పంచాయతీ కార్యదర్శిగా సేవలు అందించారు.

● ఇసప్పాలెం (నరసరావుపేట రూరల్): మండలంలోని ఇసప్పాలెం మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన మల్లెల జగన్‌మోహన్‌రావు, శివకుమారి దంపతులు రూ.1,00,116, విరాళం ఆలయ కార్యనిర్వహణ అధికారి నలబోతు మాధవీదేవికి శుక్రవారం అందజేశారు.

● నరసరావుపేట టౌన్: నరసరావుపేట పట్టణం కోటబజార్ పులుపుల వారి వీధిలోని వీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయం రాతి నిర్మాణానికి శుక్రవారం దాతలు రెడ్డి వెంకట నరసింహ నిఖిల్ కుమార్, నవ్య దంపతులు రూ.50,116లు అందజేశారు.

● కారుమంచి (శావల్యాపురం): గ్రామ స్థాయిలో బీజేపీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు గట్టుపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కారుమంచిలో బీజేపీ బూత్ కమిటీల నియామకాన్ని శుక్రవారం నిర్వహించారు.

● నరసరావుపేట టౌన్: నరసరావుపేటలోఏని ఏఎంరెడ్డి ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఘనంగా వలంటీర్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంరెడ్డి ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెస్ట్ ఫ్రమ్ వేస్ట్ సృజనాత్మక పోటీని నిర్వహించారు. ప్రత్యేక అతిథిగా పల్నాడు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఈ తమ్మాజీరావు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని కనపర్రులో ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల వారు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అనాథలైన వృద్ధులకు, పిల్లలకు హెల్పింగ్ హ్యాండ్ చేయూత కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మ, నాన్నల ప్రేమాలయ అనాథ వృద్ధాలయ ఫౌండర్ కే ధనంజయకు సుమారు రూ.10వేలు విలువైన దుప్పట్లు, నిత్యావసరాలు, పండ్లు అందజేశారు. నైస్ విద్యార్థులకు పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రోత్సాహకాలిస్తా

● మెగా పీటీఎంలో చీఫ్ విప్ జీవీ


కొత్తపాలెంలో ఉపాధ్యాయులతో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గంలో బెస్ట్ టీచర్‌గా ఎంపికైన వారికి ప్రోత్సాహకాలిస్తానని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ప్రకటించారు. మండలంలోని చీకటీగలపాలెంలోని ఏపీ మోడల్ స్కూల్, కొత్తపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ద్వారా సొంత ఖర్చులతో సింగపూర్ పంపిస్తామని, 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్రస్థాయి టాపర్లకు రూ.3లక్షలు, జిల్లా స్థాయిలో రూ.2లక్షలు, నియోజకవర్గ స్థాయిలో లక్ష అందిస్తామన్నారు. సగటు మార్కుల్లో ముందున్న పాఠశాలకు ఉత్తమ స్కూల్ అవార్డు కింద రూ.లక్ష ఇస్తామని, ఆటల్లో ముందుండే పీఈటీలకు కూడా రూ.లక్ష ప్రోత్సాహం ఇప్పిస్తామని వరాలు కురిపించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జీవో నెం. 117 వంటి అరాచక నిర్ణయాలతో జగన్ పాలనలో అధోగతి పాలయిందన్నారు. గత వైసీపీ పాలనలో ధ్వంసమైన విద్యావ్యవస్థను లోకేశ్ తిరిగి గాడిలో పెడుతున్నారన్నారని ప్రశంసిచారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) మెగా పీటీఎం 3.0లో బాగంగా శంకర బారతి పురం హైస్కూలు, క్రిష్టియన్‌పాలెం ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కూటమి నాయకులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: నరసరావుపేట పట్టణంలోని ప్రకాష్ నగర్ తిలక్ మెమోరియల్ హైస్కూల్, నరసరావుపేట మున్సిపల్ బాయ్స్ హైస్కూల్, నరసరావుపేట మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లలో పీటీఎం 3.0 నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఆయా పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శనలు ప్రత్యేక అకర్షణగా నిలిచాయి. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో పాటు ఎమ్మెల్యే, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నృత్యం చేయడంతో విద్యార్థులు కేరింతలు కొట్టారు.


నూజెండ్ల జడ్పీ పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు


మున్సిపల్ బాలికల పాఠశాలలో జరిగిన పీటీఎంలో పాల్గొన్న ఎమ్మెల్యే చదలవాడ, ఎమ్మెల్సీ ఆలపాటి, సుబ్బరాయగుప్త తదితరులు

● నరసరావుపేట టౌన్: పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో మెగా టీచర్ మీటింగ్ 3.0 శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ ఛైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్త, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాససాయి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● నూజెండ్ల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల సమావేశాలు ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగాయి. పాఠశాలల్లో సైన్స్ ప్రాజెక్టులను, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో జడ్పీటీసీ జెడ్డా సుబ్బులు రామయ్య, టీడీపీ నాయకులు డీఎల్‌డీఏ మాజీచైర్మన్ లగడపాటి వెంకటరావు, డీసీ చైర్మన్ గంగినేని రాఘవ, మండల పార్టీ అధ్యక్షుడు గంగినేని రాధాకృష్ణమూర్తి, గంగినేని ఆంజనేయులు, ఉల్లగంటి మల్లిఖార్జునరావు, లగడపాటి సూరిబాబు, బేతపూడి చిరంజీవి, గంగినేని బ్రహ్మయ్య, బేతపూడి చిరంజీవి, ఎంపీడీవో పీ ఉమాదేవి, ఎంఈవో కే సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

● యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెం జడ్పీ హైస్కూల్‌లో నిర్వహిచిన కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామపెద్దలు, విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సౌకర్యాలు, పథకాల గురించి హెచ్ఎం కేవీ రామిరెడ్డి వివరించారు. కార్యక్రమంలో మనో వైజ్ఞానిక శాస్త్ర నిపుణులు టి.సుగంధరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ కమిటీ ఛైర్మన్ షేక్ జాన్‌సైదులు, గ్రామసర్పంచ్ కరిమున్, గ్రామపెద్దలు కట్టా శ్రీహరి, మురుకుట్ల శ్రీధర్, నంబూరు తులశయ్య, తోకల సత్యనారాయణ, గోగడ హరిబాబు, నంబూరు శివరామకృష్ణ, సాధినేని సుధీర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. యడ్లపాడు సెయింట్ ఆన్స్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రీతి సిస్టర్ మాదక ద్రవ్యాలు, ఈవ్ టీజింగ్ వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు.


నగదు బహుమతి అందిస్తున్న నందిగం శ్రీనివాసరావు

● రొంపిచర్ల: మండలంలోని అన్ని పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ శుక్రవారం ఘనంగా జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలసి భోజనం చేశారు.

● బొల్లాపల్లి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో పీ మాధురి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరాజు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ డే కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శావల్యాపురం జడ్పీపాఠశాలలో ఎంపీడీవో సీతారామయ్య, కారుమంచి హెచ్‌సీ ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో సాంబశివరావు పాల్గొని విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, విద్యార్థుల సామర్థ్యాలు, బోధన ప్రణాళికలు తదితర అంశాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. తల్లిదండ్రుల నుంచి సలహాలు, సూచనలను నమోదు చేసుకొన్నారు. శావల్యాపురంలోని శ్రీరామపబ్లిక్‌స్కూల్లో కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చంద్, ప్రిన్సిపల్ రత్నకుమారి బాలోత్సవంలో ప్రతిభచూపిన విద్యార్థులను అభినందించి బహుమతులను అందజేశారు.

● ఈపూరు: మండలంలోని ఈపూరు హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రాపర్ల జగ్గారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏ.నళిని, ఎంపీడీవో ఉమాదేవి, పాఠశాల కమిటీ చైర్మన్ యయాతి రాజు, సొసైటీ డైరెక్టర్ అయినాల కోటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బెల్లంకొండ సైదులు, మీసాల చిన్న ప్రసాద్, బొల్లా సుబ్బారావు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పద్మజ పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని ఎండుగుంపాలెంలో మెగా పీటీఎంలో ముఖ్య అతిథిగా శివశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్ నందిగం శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఎండుగుంపాలెం ఎడ్యుకేష్ ట్రస్ట్ తరుపున ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు.

ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం దారుణం

● వైసీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి


బాధితులతో కలిసి వివరాలు వెల్లడిస్తున్న మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట లీగల్, నరసరావుపేట రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పల్నాడు రోడ్డులోని పాత ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాలలో వైద్యుల నిర్లక్ష్యం దారుణమని వైసీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యంపై బాధితులతో కలిసి శుక్రవారం శ్రీనివాసరెడ్డి తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పట్టణంలోని బాలయ్య నగర్‌కు చెందిన టి.రమాదేవి అనే మహిళకు నవంబరు 26వ తేదీన ట్యూబెక్టమీ ఆపరేషన్ నిర్వహించిన సమయంలో డాక్టర్ నిర్లక్ష్యంగా తొడ భాగంలో బ్లేడు మరచిపోయి కుట్లు వేశాడని ఆరోపించారు. అప్పటినుంచి ఆ మహిళకు జ్వరం వస్తూ నొప్పిగా ఉందని వైద్యుల దృష్టికి తీసుకెళ్లినా సరిగా స్పందించలేదన్నారు. ఈ నేపథ్యంలో బయట వైద్యశాలలో ఎక్స్‌రే తీయించగా తొడలో సర్జికల్ బ్లేడు ఉన్నట్లు తేలిందన్నారు. శస్త్ర చికిత్స సమయంలోనూ సిబ్బంది మహిళపై చేయి చేసుకున్నారని ఆరోపించారు. ఆపరేషన్ చేయడానికి రూ.2000 రూపాయలు తీసుకున్నారని, అంతేకాకుండా సదరన్ క్యాంపులో రూ.25 నుంచి 30 వేలు వసూలు చేస్తున్నారన్నారని శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. రమాదేవికి వెంటనే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఉచితంగా చేయాల్సిన శస్త్ర చికిత్సకు సిబ్బంది రెండు వేల వసూలు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఏమాత్రం ప్రజలకు సరైన చికిత్స అందడం లేదని, అవినీతి రాజ్యమేలుతుందని, ఈ అవినీతిలో ఎమ్మెల్యేకు వాటా ఉందని ఆరోపించారు. వైద్యుడైన ఎమ్మెల్యే ఇప్పటికైనా స్పందించి తగు రీతిలో ప్రభుత్వ వైద్యశాలలోని సిబ్బంది పనితీరుపై సమీక్షించి ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

డాక్టర్ నారాయణస్వామి సస్పెన్షన్

నరసరావుపేట లీగల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాగా చికిత్సలో నిర్లక్ష్యం వహించాడని ఆరోపణ ఎదురుకుంటున్న డాక్టర్ నారాయణస్వామిని సస్పెండ్ చేసినట్లు పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ రవి తెలిపారు. జిల్లాలోని ఓ అధికార కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ పద్మావతి ఈ అంశంపై డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమీక్షించారు. బాధిత మహిళలకు శస్త్ర చికిత్స నిర్వహించిన సిబ్బందిది విచారించి, రికార్డులను పరిశీలించారు.

పేరూరుపాడులో కంటి వైద్య శిబిరం


పేరూరుపాడులో కంటి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బొల్లాపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరుపాడులో ఎల్‌వీ ప్రసాదు నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ సౌజన్యంతో ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో గంధం యలమందారెడ్డి, తోట శ్రీనివాసరావు, ధూపాటి రవి, ధూపాటి దేవదాసు, కొత్త మల్లారెడ్డి, గంధం హనిమిరెడ్డి, తంగిరాల లక్ష్మారెడ్డి, విశాఖపట్నం నుంచి వచ్చిన విజయవాడ ఈస్ట్ కో-ఆర్డినేటర్ పర్వతనేని హరికృష్ణ, వినుకొండ నియోజక వర్గ కో-ఆర్డినేటర్ పీ సిద్దయ్య, వేముల ప్రసాదు, జిల్లా కన్వీనర్ రూబేన్ తదితరులు పాల్గొన్నారు.

వయ్యకల్లు సర్పంచ్‌కు నివాళి


మృతదేహానికి నివాళులర్పిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వయ్యకల్లు (శావల్యాపురం) డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వయ్యకల్లు గ్రామసర్పంచ్‌గా విధులు నిర్వహిస్తూ గురువారం గుండెపోటుతో మృతిచెందిన గోనుగుంట్ల వెంకటేశ్వర్లు అంతిమ యాత్రను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంతిమయాత్రలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొని వెంకటేశ్వర్లు మృతదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అంతిమయాత్రలో టీడీపీ మండలాధ్యక్షులు గుంటూరు సాంబశివరావు, సొసైటీ ఛైర్మన్‌లు గడిపూడి విశ్వనాథం, గోపాళం శివప్రసాద్, సీనియర్ నాయకులు యరమాసు కోటేశ్వరరావు, బొల్లా పేరయ్య, చింతా గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి హల్‌చల్

శావల్యాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో మనస్థాపానికి గురైన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సెల్‌ఫోన్ టవర్ ఎక్కి రెండు గంటలపాటు హల్‌చల్ చేసిన ఘటన శావల్యాపురం మండలం కనమర్లపూడిలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు యడ్లపాడు మండలం దింపెనపాడుకు చెందిన రాజేష్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రేమలో విఫలమయ్యానంటూ మనస్థాపానికి గురై శుక్రవారం మధ్యాహ్నం కనమర్లపూడిలో సెల్‌ఫోన్ టవర్ ఎక్కాడు. స్థానికులు గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ బాజీ సిబ్బందితో కలసి సెల్ టవర్ దగ్గరకు చేరుకొని వినుకొండ రూరల్ సీఐ బ్రహ్మయ్యకు విషయాన్ని తెలియజేశారు. ఆయన అగ్నిమాపక సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మైకులో రాజేష్ కిందికి దిగాలని కోరారు. రెండు గంటల డ్రామా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో కిందికి దిగాడు. అనంతరం పోలీసులు రాజేష్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. అంతలో రాజేష్ కుటుంబసభ్యులు కూడా అక్కడికి రావడంతో వారికి అప్పగించారు. రూరల్ సీఐతో వినుకొండ పట్టణ ఎస్ఐ కృష్ణారావు, బొల్లాపల్లి ఎస్ఐ సమీర్, కానిస్టేబుళ్ళు ఉన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు తిమ్మాపురం విద్యార్థులు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు

యడ్లపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం తిమ్మాపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన జోనల్, జిల్లా స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభను చూపిన విద్యార్థులు రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు బి.ప్రవీణ్, డి.సాగర్‌బాబు, వి.ప్రభాస్, మల్లికార్జునలు రాష్ట్ర సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపిక కాగా, కె.అనిల్, వి.ప్రభాస్‌లు బేస్‌బాల్ జట్టులో స్థానం పొందారు. త్వరలో జరగనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను, శిక్షణఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు వేమిరెడ్డిలను మాజీ సర్పంచ్ పావులూరి శ్రీనివాసరావు, హెచ్ఎం వెంకటాద్రినాయుడు, గ్రామపెద్దలు పావులూరి చంద్రశేఖర్, పిచ్చియ్య, ఉడతా వెంకట్రావు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు అభినందించారు.


చిలకలూరిపేటలో అభిమానులకు అభివాదం చేస్తున్న పవన్ కల్యాణ్

పవన్ కల్యాణ్ రాకతో సందడి

చిలకలూరిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శుక్రవారం చిలకలూరిపేటలో ఘన స్వాగతం లభించింది. ఆయన రాకతో చిలకలూరిపేటలో సందడి వాతావరణం నెలకొంది. పట్టణంలోని ప్రధాన రహదారులు స్వాగత తోరణాలు, భారీ ఫ్లెక్సీలతో నిండిపోయాయి. నరసరావుపేట సెంటర్ నుంచి పవన్ కల్యాణ్ కార్యక్రమం జరిగే శారదా హైస్కూల్ వరకు జనసేన నాయకులు భారీఎత్తున కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. దారి పొడవునా జనసేన, టీడీపీ జెండాలు రెపరెపలాడాయి. కేబీ రోడ్డులో పవన్ కళ్యాణ్‌కు భారీ క్రేన్ సాయంతో 'గజమాల' వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. భద్రతా కారణాల రీత్యా అనుమానాస్పద ప్రాంతాలలో, పవన్ కాన్వాయ్ వెళ్లే మార్గాలలో ముందుజాగ్రత్తగా దుకాణాలను మూసివేయించారు. ఎమ్మెల్యే ప్రతిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు స్వాగత ఏర్పాట్లు చేయగా జనసేన నాయకులు మండలనేని చరణ్ తేజ, చిలకలూరిపేట నియోజకవర్గం కన్వీనర్ తోట రాజా రమేష్‌ల ఆధ్వర్యంలో పవన్‌కు ఘనస్వాగతం పలికాయి. శారదా హైస్కూలు గ్రంథాలయానికి 25 కంప్యూటర్లు, పుస్తకాలు, ర్యాకులు అందిస్తానన్న పవన్ గొప్ప మనసుకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ధన్యవాదాలు తెలిపారు.

●నాదెండ్ల: చిలకలూరిపేట పర్యటనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు గణపవరం వద్ద కూటమి నేతలు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, పెంటాల శేషయ్య, అచ్చయ్య, లీల, గాలి బుచ్చయ్య తదితరులు ఉన్నారు.

సంక్రాంతికి టిడ్కో గృహాలు పంపిణీ

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు


టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సొంతింటి సాకారం చేసే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, సంక్రాంతి పండుగ నాటికి టిడ్కో గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట మండలం కేశానుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించిన టిడ్కో గృహాలను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. టిడ్కో గృహాలలో మౌలిక వసతులు కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కృషి చేస్తుందని తెలిపారు. టిడ్కో గృహాలలో తాగునీరు, వీధిదీపాలు, పారిశుద్ధ్యం వంటి సౌకర్యాలు మెరుగుపరిచేందుకు ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టిడ్కో గృహాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బత్తుల సెల్వరాజ్, కమిటీ సభ్యులు శంకర్, బుజ్జి, మల్లేశ్వరి, బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ ఝాన్సీరాణి

మహిళల జీవనోపాధి మెరుగునకు ప్రత్యేక కృషి

● జిల్లా ప్రాజెక్టు అధికారి ఝాన్సీరాణి

నరసరావుపేట రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధికి, జీవనోపాధులు మెరుగుపరచేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి తెలిపారు. కోటప్పకొండలోని సీఎంటీసీ శిక్షణ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విజన్ మాడ్యూల్1పై జరుగుతున్న మూడోరోజు శిక్షణ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఝాన్సీరాణి పాల్గొని మాట్లాడుతూ మహిళల ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా యూనిట్లను గ్రౌండింగ్ చేసి జీవనోపాధులు పెంపుదల చేయాలన్నారు. శిక్షణా కార్యక్రమంలో ఏపీడీ రాజా ప్రతాప్, బ్యాంకు లింకేజ్ డీపీఎం శ్రీనివాసులు, శిక్షకులుగా యడ్లపాడు ఏపీఎం రవీంద్ర, ఏడు మండలాల ఏపీఎంలు, సీసీలు, అకౌంటెంట్‌లు, నరసరావుపేట మండల సమాఖ్య కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పాం సాగుతో రైతులకు లాభాలు: జిల్లా ఉద్యాన శాఖ అధికారి

నాదెండ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పాం సాగుతో రైతులకు లాభాలు దక్కుతాయని జిల్లా ఉద్యానశాఖ అధికారి వెంకటరావు అన్నారు. మండలంలోని ఇర్లపాడు, నాదెండ్ల గ్రామాల్లో ఉద్యానశాఖ, గోద్రేజ్ కంపెనీలు సంయుక్తంగా పంటలో నీటి యాజమాన్యం, వ్యాధి నియంత్రణ విధానాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయిల్ పాం సాగులో నాలుగు సంవత్సరాల పాటు అంతర్ పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి ఆర్ శ్రీలక్ష్మి, గోద్రేజ్ కంపెనీ అధికారులు పాల్గొన్నారు.

ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేసానుపల్లిలోని ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి బెంగుళూరుకు చెందిన ట్యాప్ అకాడమీ ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారని డైరెక్టర్ దరువూరి శ్రావ్య శుక్రవారం తెలిపారు. భవ్యశ్రీ, పుష్పలత, అనితలు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లుగా ఎంపికయ్యారని చైర్మన్ మేదరమెట్ల శేషగిరిరావు తెలిపారు. వీరికి రూ.4లక్షల నుంచి రూ.6లక్షల వరకు ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ సాధినేని రామారావు తెలిపారు. విద్యార్థులను ప్లేస్మెంట్ అధికారి జె.రవిశంకర్, అధ్యాపకులు రాధికా, సితార, నవీన్ అభినందించారు.

చివరి భూములకు సాగు నీరు అందించాలి

● అధికారులకు డీసీ చైర్మన్ల వినతి

నూజెండ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాలువ చివరి భూములకు సాగు నీరు సక్రమంగా అందించాలని ములకలూరు డీసీ చైర్మన్ నక్క బుల్లీశ్వరరెడ్డి, వేముల డీసీ చైర్మన్ శ్రీనివాసరావు, మాజీ ములకలూరు డీసీ కాకాణి వీరాంజనేయులులు ఎన్ఎస్‌పీ అధికారులను కోరారు. శుక్రవారం మండలంలోని రవ్వవరం పీబీసీ రెగ్యులేటర్ వద్ద నాయకులు, అధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మలమడక చివరి గ్రామాలైన కొండలరాయునిపాలెం, మక్కెనవారిపాలెం, ములకలూరు, కొత్త కొత్తపాలెం, పాత కొత్తపాలెం, బొప్పూడివారిపాలెం తదితర గ్రామాలకు, మోదేపల్లి మేజరు పరిధిలోని అగ్రహారం, వేముల తదితర గ్రామాలకు తాగునీటి సమస్యలు ఉన్నాయని వినుకొండ డీఈ వెంకటరమణ, ముండ్లమూరు డీఈ పూర్ణచంద్రరావులకు వివరించారు. ఈ సందర్భంగా చర్చలు జరిపి చివరి భూములకు నీరు విడుదల చేసేలా ఒప్పందాలు చేసుకొని అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో నీటి సంఘాల అధ్యక్షుడు సాంబయ్య, వీరాంజనేయులు, ఇండ్లూరి వెంకటరావు, రైతులు పాల్గొన్నారు.